# ప్రజా తపన

prajathapana.com

News that matters




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 68 బుధవారం 26 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## ప్రధాని మోడీ 'మన్ కీ బాత్' ప్రభావం

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

దేశంలోని మారుమూల ప్రాంతాలతోపాటు.. ప్రజలందరికీ తన మనస్సులోని మాటలు, అనుసరిస్తున్న విధానాలు, ప్రముఖ వ్యక్తుల జీవితాలు.. ఇలా ఎన్నో అంశాలు చేరువ కావాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 3న ప్రారంభించారు. ప్రతినెల చివరి ఆదివారం.. ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. దీనిలో ఆసక్తికర విషయాలను చెప్పడంతోపాటు.. పలు అంశాల గురించి ప్రధాని మోడీ వివరిస్తారు. మన్ కీ బాత్‌లో సామాన్యులకు తెలియని అనేక విషయాలను.. ప్రధాని మోడీ సవివరంగా చెప్పే తీరు ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే ఈ కార్యక్రమం ప్రారంభించిన కొన్నాళ్లకే.. ఎంతో ప్రజాదరణను పొందింది. దీంతోపాటు కోట్లాది మంది హృదయాలను సైతం గెలుచుకుంది. ఈ ప్రోగ్రామ్ కు అత్యధిక రేటింగ్ వచ్చినట్లు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో సైతం వెల్లడైంది. 100 మందికి పీఎం మన్ కీ బాత్ చేరువైంది. అంతేకాకుండా ఈ కార్యక్రమాన్ని పలు భాషల్లో, పలు ప్లాట్‌ఫాంలలో సైతం ప్రసారం చేయడంతో.. ఇది అనేక మందికి చేరువైనట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే.. మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్‌కు చేరువైంది. ఏప్రిల్ 30వ తేదీన జరిగే ఎపిసోడ్‌తో 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకోనుంది. ఈ 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ప్రధాని మోడీ.. ఏ విషయం గురించి మాట్లాడతారు, ఎలాంటి విషయాలను ప్రస్తావిస్తారనేది దేశప్రజలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధాని మోడీ.. మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్‌కు ముందు ప్రసార భారతి మాజీ సీఈఓ శశి శేఖర్ వెంపటి.. ఓ ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రసార భారతి మాజీ సీఈఓ వెంపటి శశి శేఖర్ మంగళవారం ట్వీట్

02

## అవినాష్ రెడ్డికి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**ప్రజా తపన ,హైదరాబాద్**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైఎస్ అవినాష్ రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణను బుధవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదావేసింది. ముందుగా ఈ కేసు విచారణ ఉదయం ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే సుప్రీం కోర్టు ఆర్డర్ కాపీ ఇంకా అందలేదని అవినాష్ తరపు లాయర్ కోర్టుకు చెప్పారు. దీంతో ఆర్డర్ కాపీని చూసిన తర్వాతే తుది తీర్పును వెల్లడిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీ అందిన తర్వాత మధ్యాహ్నం మళ్లీ విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాదనలు బుధవారం వింటామని న్యాయమూర్తి .. కేసును వాయిదా వేశారు. గత విచారణలో ఈనెల 25 వరకు

02



## శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

**ప్రజా తపన ,చెన్నై :**

బీజేపీ కోరిక పరిశీలించిన మీదట కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన విరమించుకున్నట్లు అన్నాడీఎంకే ప్రకటించింది. కర్ణాటక శాసనసభ ఎన్నికలు మే 10వ తేది జరునుండగా, నామినేషన్ల స్వీకరణ ఈ నెల 13న ప్రారంభమై 20వ తేదీతో ముగిసింది. ఈ విషయమై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో, కర్ణాటక ఎన్నికల్లో పులికేశి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నిర్ణయించి, అభ్యర్థిగా టి.అన్బరసన్‌ను ప్రకటించామన్నారు. ఈ

02

## మోడీ జీ.. మా దేశాన్ని దత్తత తీసుకోండి ప్లీజ్'..

**ప్రజా తపన ,ఇస్లామాబాద్**



గత కొన్ని దశాబ్దాలుగా కశ్మీర్ సరిహద్దు అంశంపై భారత్ , పాకిస్థాన్‌ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పీఓకే గురంచి ప్రపంచ వ్యాప్తంగా కూడా చర్చ జరుగుతోంది. ఈక్రమంలో పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ బ్లాగర్, వ్యాపార వేత్త వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఇందులో ఇనాయా భట్ అనే బ్లాగర్ పాకిస్తాన్‌ను లీజుకు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోడీని అభ్యర్థించాడు. అలాగే కశ్మీర్‌లో అంతర్భాగమైన ప్రజలు ఎంతో అదృష్టవంతులుని, ఎందుకంటే వారు భారత భూభాగంలో ఉన్నారంటూ పరోక్షంగా పాక్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశాడు. ' ప్రస్తుతం భారత దేశం యూఎస్, యూకేలకు ధీటుగా ఎదుగుతోంది. ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా ముందుకు అడుగేస్తోంది. వాణిజ్యం, ఐటీ ఉత్పాదక రంగాల్లో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. కానీ పాక్‌లో మాత్రం బిర్యానీ ఎలా వండాలి? మరింత రుచికరంగా వచ్చేందుకు ఏమేం కలపాలి? కబాబ్‌ల టేస్ట్ పెంచేందుకు ఏం చేయాలి? అంటూ ఆలోచిస్తూ బిజీగా ఉంటున్నారు .పాకిస్థాన్ ప్రజలతో పాటు ఇక్కడి ప్రభుత్వం కూడా నిరుపేదనే. వారు కశ్మీర్ అంశం తప్ప పౌరుల గురించి ఏమీ పట్టదు. కాబట్టి మోడీ జీ మమ్మల్ని దత్తత తీసుకోవాలి. అప్పుడే పాక్ ప్రజల భవిష్యత్ బాగుపడుతుంది' అంటూ ఈ వీడియోలో చెప్పుకొచ్చాడు బ్లాగర్. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాగా పాక్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పతనవస్థలో ఉంది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో పాక్ ప్రభుత్వంపై ఆ దేశ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈక్రమంలోనే గత కొన్ని రోజులుగా పాక్ సింగర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాక్ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్నారు. అదే సమయంలో భారత ప్రభుత్వం, మోడీ పని తీరును ప్రశంసిస్తూ పోస్టులు పెడుతున్నారు.

## తలుపులు తెరుచుకున్న కేదార్‌నాథ్ దేవాలయం

**ప్రజా తపన ,ఉత్తరాఖండ్ :**



మంచుతుపాన్ తగ్గడంతో కేదార్‌నాథ్ దేవాలయం భక్తుల సందర్శన కోసం మంగళవారం తలుపులు తెరిచారు మంగళవారం ఉదయం 6.20 గంటలకు కేదార్‌నాథ్ ధామ్ తలుపులు భక్తుల కోసం తెరిచామని శ్రీ బద్రీనాథ్ కేదార్ నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ చెప్పారు. కేదార్‌నాథ్ ధామ్ పోర్టల్‌ను ఆలయ ప్రధాన పూజారి జగద్గురు రావల్ భీమా శంకర్ లింగ్ శివాచార్య ప్రారంభించారు.ఆలయాన్ని 35 క్వింటాళ్ల పూలతో అలంకరించారు. బాబా కేదార్ పంచముఖి చల్ విగ్రహ డోలీ కూడా సోమవారం ధామ్‌కు

02

## బెంగళూరులో జీరో షాడో డే

**ప్రజా తపన ,బెంగళూరు,:**



ఓ ప్రత్యేకమైన ఖగోళ సంఘటనకు ఏప్రిల్ 25న బెంగళూరు నగరం సాక్ష్యంగా నిలిచింది. కాసేపు ఈ అరుదైన జీరో షాడో దేగా రికార్డ్ కు ఎక్కింది అంటే కొన్ని క్షణాల పాటు బెంగళూరులో నిటారై వాటికి నీడపడదు. ఆ సెకన్లలో జీవులు, వస్తువులతో పాటు వేటికి కూడా నీడ కనిపించదు. అందుకే దీన్ని జీరో షాడో డేగా పిలుస్తారు. ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం 12:17 గంటలకు కొన్ని సెకన్ల పాటు ఈ అరుదైన విషయం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా బెంగళూరులోని కోరమంగళ వద్ద ఉన్న క్యాంపస్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఓ ఈవెంట్ నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను ఇప్పటికే కొందరు ట్వీట్లు

02

# రాయలసీమ లో రాజధాని ఏర్పాటుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలి

**ప్రజా తపన ,కర్నూల్**



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా చెప్పిన న్యాయ రాజధాని ని వెంటనే ఏర్పాటు చెయ్యాలి. స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా చెప్పి బిల్లు గా తెచ్చినా ఇంతవరకు ఆమోదించకపోవడం దారుణం అన్నారు.అలానే రాయలసీమ లో రాజధాని హైకోర్టు కు ఆమోదం తెలిపి లోకేస్ పాదయాత్ర చెయ్యాలి అని రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలోకర్నూల్ కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ లో రాజధాని హైకోర్టు ఏర్పాటు చేయడానికి అడుగడుగునా అడ్డుపడుతున్న లోకేష్ కి రాయలసీమ లో పాదయాత్ర చేసే అర్హత లేదనిఅన్నారు.విభజన చట్టం ప్రకారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరి కి తరలించి కరువుజిల్లా అనంతపురం కు తీరని ద్రోహం చేసారని అన్నారు.రాయలసీమ లో హైకోర్టు పెట్టాలని అంటే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ని ఆడిగితే ఉరికొక హైకోర్టు పేడతారా అని హేళన చేశారు మరి అలాంటి వారు ఏ రకంగా రాయలసీమ లో పాదయాత్ర చేస్తారన్నారు.అభివృద్ధి అంతా అమరావతి లో చేయాలనుకునే వారికి రాష్ట్రం అంతా ఓట్లు ఎలా అడుగుతారన్నారు.లోకేష్ టీడీపీ పార్టీ రాయలసీమ లో రాజధాని హైకోర్టు పై తన అభిప్రాయాన్ని తెలిపి పాదయాత్ర చేయాలన్నారు.
ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు , కాశి రావు, జ్ఞానేశ్వర్ రెడ్డి,గురుసంకర్,కోటేశ్వరరావు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రధాని మోడీ 'మన్ కీ బాత్' ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

చేసి వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్.. ఈ వారాంతంలో100వ ఎపిసోడ్‌కి చేరుకుంది. ఈ సందర్భంగా "కలెక్టివ్ స్పిరిట్, కాంక్రీట్ యాక్షన్స్" అనే పుస్తకాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందంటూ తెలిపారు. మన్ కీ బాత్ కార్యక్రమం.. భారతదేశంపై దాని ప్రభావం.. అనే విషయాలను దానిలో పంచుకున్నట్లు తెలిపారు.మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోడీ ఎలాంటి మార్పులకు నాంది పలికారు.. అదేవిధంగా సమాజంపై ఎలాంటి ప్రభావం చూపించింది.. అనే విషయాలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమం భారతదేశ ప్రజల్లో ఎలాంటి బలమైన మార్పును తీసుకువచ్చిందో సవివరంగా.. దానిలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. కార్యక్రమానికి ముందు.. ఆ తర్వాత విషయాలను కూడా ప్రస్తవించినట్లు సమాచారం..

# శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో, పులికేశి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే ఆలోచన విరమించుకొని తమకు మద్దతివ్వాలని బీజేపీ అధిష్ఠానం టెలిఫోన్ ద్వారా సంప్రదించిందని తెలిపారు. బీజేపీ కోరికను పార్టీ నేతలతో చర్చించామన్నారు. అందరి అభిప్రాయంతో అన్బరసన్ నామినేషన్ ఉపసంహరించుకోవాలని కోరినట్లు పళనిస్వామి తెలిపారు. కాగా, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓపీఎస్ తరఫు అభ్యర్థులు ఇద్దరు నామినేషన్ ఉపసంహరించుకున్న నేపథ్యంలో, ఈపీఎస్ అభ్యర్థి కూడా నామినేషన్ వెనక్కు తీసుకున్నారు.

# అవినాష్ రెడ్డికి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయొద్దని, తాము చెప్పిన విధంగా అవినాష్‌ను విచారించాలని సీబీఐ అధికారులకు తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అలాగే అవినాష్ మధ్యంతర బెయిల్‌ను తెలంగాణ హైకోర్టు మంజూరు చేసింది. దీనిపై సునీతరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. మధ్యంతర బెయిల్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. అలాగే ముందస్తు బెయిల్‌పై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం అవకాశం కల్పించింది. ఈ క్రమంలో హైకోర్టులో అవినాష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగాల్సి ఉంది. బుధవారం ముందస్తు బెయిల్ వస్తుందా లేదా అన్నదానిపై క్లారిటీ వస్తుంది. మరో వైపు అవినాష్ రెడ్డి సుప్రీంకోర్టు తన మధ్యంతర బెయిల్ ను కొట్టి వేసిన తర్వాత హైదరాబాద్ ఇంటి నుంచి వెళ్లిపోయారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన పులివెందుల చేరుకున్నారు. అనుచరులతో కీలక సమావేశాలు నిర్వహించనున్నట్లుగా వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజాదర్బార్ కూడా నిర్వహిస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు. సీబీఐ అరెస్ట్ చేస్తే ఎలాంటి వ్యూహం అవలంభించాలన్నదానిపై అవినాష్ రెడ్డి చర్చలు జరిపే అవకాశం ఉందని చెబుతున్నారు. మరో వైపు సీబీఐ అధికారులు కూడా పులివెందులలోనే ఉన్నారు. పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పలు అంశాలపై సీబీఐ అధికారులు పులివెందులలో విచారణ జరుపుతున్నారు. వివేకా ఇంట్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను పిలిపించుకుని పలు అంశాలపై ఆరా తీశారు. హత్య జరిగిన రోజు ఇనయతుల్లా బాత్‌రూంలో మృతదేహాన్ని తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసి కుటుంబ సభ్యులకు పంపారు. ఇనయతుల్లాను వెంటబెట్టుకుని అవినాశ్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. రెండుసార్లు పులివెందుల పరిసర ప్రాంతాలు పరిశీలించారు. వివేకా ఇంటినుంచి అవినాశ్ రెడ్డి ఇంటివద్దకు రెండుసార్లు వాహనాల్లో తిరిగారు. వాహనాల్లో వెళ్లడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై సాంకేతిక ఆధారాలు సేకరించారు. అవినాశ్‌రెడ్డి చెప్పిన దాంట్లో వాస్తవం ఎంత? అన్నదానిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సీబీఐ బృందం పులివెందుల రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ దగ్గర ఉన్న ఆధారాలను సాంకేతికంగా నిర్ధారించుకోవడానికి సీబీఐ అధికారులు ఇలా చేస్తున్నారని అంటున్నారు.
దర్యాప్తు పూర్తి చేయడానికి సీబీఐకిచ్చిన గడువును పొడిగించాలని సునీతారెడ్డి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. లూథ్రా విజ్ఞప్తి చేయగా.. అవినాశ్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వ్యతిరేకించారు. ఈ నెల 30లోగా దర్యాప్తును పూర్తి చేస్తామని సీబీఐ తరఫున గతంలో అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు హామీ ఇచ్చారని, అందువల్లే కోర్టు ఆ గడువు విధించిందని గుర్తు చేశారు. పైగా గడువు పొడిగించాలని సునీతారెడ్డి ఎలా కోరతారని ప్రశ్నించారు. అయితే గడువు పొడిగించాలని సొలిసిటర్ జనరల్ కూడా అభ్యర్థించడంతో ధర్మాసనం అంగీకరించింది. జూన్ 30 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది.

# తలుపులు తెరుచుకున్న కేదార్‌నాథ్ దేవాలయం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుంది.కేదార్‌నాథ్‌లో అడపాదడపా మంచు కురుస్తున్న దృష్ట్యా యాత్రను ప్రారంభించే ముందు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని కోరారు .యాత్రికుల ఏర్పాట్లపై సమీక్షించేందుకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా సాయంత్రం గుప్తకాశీ చేరుకున్నారు. రాష్ట్రంలో చార్ ధామ్ యాత్రకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, భగవంతుని దయ వల్ల గతేడాది కంటే ఈ ఏడాది యాత్రకు భక్తులు అధికంగా వస్తారని సీఎం సింగ్ తెలిపారు.యాత్రికుల రక్షణ కోసం పెద్ద ఎత్తున భద్రతా సిబ్బందిని మోహరించారు.

# బెంగళూరులో జీరో షాడో డే

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. నీడలేని కొన్ని క్షణాల కోసం వేచిచూస్తున్నారు.మధ్యాహ్నం వేళ సూర్యుడు ఉచ్ఛస్థితిలో ఉన్న సమయంలో భూమిపై నీడలు కనిపించవు. ఆ అసాధారణ సమయాన్ని జీరో షాడో డేగా ఆస్ట్రో నామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (యాఎ) పేర్కొంది. ఓ ప్రాంతంలో జీరో షాడో డే సంవత్సరంలో రెండుసార్లు కొన్ని సెకన్ల పాటు సంభవిస్తుందని యాఎ పేర్కొంది. కర్కాటక, మకరరేఖల మధ్య ఉన్న ప్రాంతాల్లో ఇది సంభవిస్తుంది. ఈ ప్రాంతాల్లో నివసించే వారికి ఉత్తరాణం, దక్షిణాయణంలో సూర్యుడి కాంతి క్షీణత అక్షాంశానికి సమానంగా కొన్ని సెకన్లు ఉంటుంది. దీంతో కొన్ని క్షణాలు నీడలు కనిపించవు. సూర్యుడి చుట్టూ భూమి భ్రమించే క్రమంలో భ్రమణ అక్షం 23.5 డిగ్రీలు వంగిపోతుంది. ఈ క్రమమే రుతువుల మార్పునకు కారణం అవుతుంది. ఈ సమయంలో సూర్యుడు అత్యంత ఎత్తైన ప్రదేశం అంటే నడినెత్తి మీదికి వస్తాడు. 23.5 డిగ్రీల వంకరగా భూ భ్రమణ అక్షం ఉన్న సమయంలో ఉత్తరాయణంలో ఓసారి, దక్షిణాయణంలో ఓసారి కొన్ని సెకన్ల పాటు సూర్యుడు సరిగ్గా మధ్యలోకి వస్తాడు. దీన్ని జెనిత్ పొజిషన్ అని అంటారు. మకర రాశి, కర్కాటక రాశి +23.5, -23.5 డిగ్గీల అక్షాంశాల మధ్య ఉన్న సమయంలో ఇది జరుగుతుందని ఆస్ట్రోనామికల్ సొసైట్ ఆఫ్ ఇండియా (యాఎ) తెలుపుతోంది. 23.5 డిగ్రీల ఉత్తర, 23.5 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య ఉండే ప్రాంతాల్లో ఏడాదికి రెండుసార్లు సూర్యుడి క్షీణత అక్షాంశానికి కొన్ని సెకన్ల పాటు సమానంగా ఉంటుంది. ఆ సమయంలోనే నీడలు కనిపించవు.నీడలు కనిపించని ఈ సమయం కొన్ని సెకన్ల పాటు మాత్రమే ఉంటుంది. అయితే, దీని ప్రభావాన్ని నిముషంన్నర వరకు చూడవచ్చు.

# 30 వరకు చార్ ధామ్ యాత్ర రద్దు

**న్యూఢిల్లీ:**

ఈ నెల 22వ తేదీన చార్ ధామ్ యాత్ర ప్రారంభమైంది. హిమాలయ పర్వత సానువుల్లో భారీగా మంచు కురుస్తున్న కారణంగా రిషికేశ్, హరిద్వార్‌లో కేదార్‌నాథ్ యాత్రకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అయితే, కేదార్‌నాథ్ ఆలయం ముందుగా ప్రకటించినట్టే ఏప్రిల్ 25 మంగళవారం నాడు తెరుచుకోనుంది. ఎగువ గర్వాల్ హిమాలయ ప్రాంతంలో భారీగా మంచు కురుస్తున్న నేపథ్యంలో యాత్రికుల భద్రత దృష్ట్యా రిషికేశ్, హరిద్వార్‌లో కేదార్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 30వ తేదీ వరకు నిలిపివేశారు. గర్వాల్ డివిజన్ అదనపు కమిషనర్ (పరిపాలన), చార్‌ధామ్ యాత్ర అడ్మినిస్ట్రేషన్ ఆర్గనైజేషన్ అదనపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరేంద్ర సింగ్ కవిరియాల్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం దృష్ట్యా ఏప్రిల్ 30 వరకు రిషికేశ్, హరిద్వార్‌లో కేదార్‌నాథ్ యాత్ర కోసం యాత్రికుల నమోదును తాత్కాలికంగా నిలిపివేశామని తెలిపారు. కాగా.. చార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 22న అక్షయ తృతీయ రోజున ప్రారంభమైంది. గంగోత్రి, యమునోత్రి పవిత్ర పుణ్యక్షేత్రాలు ఏప్రిల్ 22న యాత్రికుల కోసం తెరుచుకున్నాయి. బద్రీనాథ్ ఆలయం ఏప్రిల్ 27న తెరవనున్నారు.చార్‌ధామ్ యాత్ర కోసం ఇప్పటివరకు మన దేశంతో పాటు విదేశాల నుంచి 16 లక్షల మందికి పైగా భక్తులు నమోదు చేసుకున్నారు. ప్రజలు వాతావరణ సూచనలను పాటించాలని, తగినంత వెచ్చదనాన్నిచ్చే దుస్తులను కూడా వెంట తీసుకెళ్లాలని ప్రభుత్వం సూచించింది. ప్రతికూల వాతావరణం కారణంగా యాత్రికులు ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది, అయినప్పటికీ, యాత్రికుల కోసం అధికారులు దారి పొడవునా తగిన ఏర్పాట్లు చేశారు.ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లు జారీ చేశామని తెలిపారు. ఇందులో ప్రయాణ సమయంలో పర్వత వాతావరణానికి తమ శరీరాలను అలవాటు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. కష్టంగా అనిపించినప్పుడు కొంత సమయం విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత మాత్రమే ప్రయాణం కొనసాగించాలని కోరారు. చార్ ధామ్ యాత్ర దేశంలోని అత్యంత పవిత్రమైన తీర్థయాత్రలలో ఒకటిగా భావిస్తారు. ఇందులో గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ అనే నాలుగు పవిత్ర పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకుంటారు. ఏప్రిల్ 25వ తేదీ 25వ తేదీన ఉదయం 6.30 నిముషాలకు కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకుంటాయని అధికారులు వెల్లడించారు. అంతకు ముందు తెల్లవారు జామున 4 గంటలకు ఓంకారేశ్వర్ ఆలయంలో మహాభిషేక పూజ నిర్వహిస్తారు. అర్చకులు గర్భగుడిలో అన్ని క్రతువులూ పూర్తి చేశాక ఆలయ తలుపులు తెరుస్తారు. ఉదయం 8.30 నిముషాలకు హారతి కార్యక్రమం ఉంటుంది. ఆ తరవాత 9 గంటలకు ఆలయ పూజారులు పంచ్‌కేదార్ గడ్డిస్థల్ వద్ద పంచాంగం వినిపిస్తారు. ఆ రోజంతా భజనలు జరుగుతాయి. ఇక బద్రినాథ్ యాత్ర చేయాలనుకునే వారికీ కీలక సమాచారం ఇచ్చారు అధికారులు. ఏప్రిల్ 27వ తేదీన ఉదయం 7.10 నిముషాలకు బద్రినాథ్ ధామ్‌ను తెరవనున్నారు. ఆరోజు వసంత పంచమి కావడం వల్ల ఎక్కువ మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

# సిద్ధరామయ్య వ్యాఖ్యలకు జగదీశ్ షెట్టార్ సమర్థన

**బెంగళూరు**



'అవినీతి లింగాయత్ ముఖ్యమంత్రి' అంటూ బసవరాజ్ బొమ్మైపై కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్య రాజకీయ దుమారం రేపింది. అయితే, సిద్ధరామయ్య వ్యాఖ్యలను ఇటీవల కాంగ్రెస్ లో చేరిన లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన నేత జగదీశ్ షెట్టార్ సమర్థించారు. కర్నాటకలోని హుబ్లీ-ధార్వాడ్-సెంట్రల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా జగదీష్ షెట్టర్ పోటీ చేస్తున్నారు. ఎన్నికల వేళ సిద్ధరామయ్య చేసిన "అవినీతి లింగాయత్ ముఖ్యమంత్రి" వ్యాఖ్యను ఆయన సమర్థించారు. ఈ వ్యాఖ్య ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైని ఉద్దేశించి చేసిందని, అందరు లింగాయత్ సిఎంలపై కాదని షెట్టార్ చెప్పారు.సిద్ధరామయ్య వ్యాఖ్య కేవలం ప్రస్తుత సీఎం బొమ్మైపైనే తప్ప అందరు లింగాయత్ సీఎంలపై కాదన్నారు. ఆయన ఇతర లింగాయత్ సీఎంలపై వ్యాఖ్యానించలేదని తెలిపారు. చాలా మంది లింగాయత్ నాయకులు బిజెపిని విడిచిపెట్టారని షెట్టార్ గుర్తుచేశారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం అంటే ఈ ప్రాంత ప్రజలను దెబ్బతీయడం అని చెప్పారు. ఇది బిజెపి ఓటు బ్యాంకును ప్రభావితం చేస్తుందన్నారు. హావేరి జిల్లాలోని బ్యాడగి తన నియోజకవర్గంలో లేదని, చాలా మంది కాంగ్రెస్ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేయమని తనను అడుగుతున్నారని షెట్టార్ చెప్పారు. లింగాయత్ సామాజికవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని, ఒకటి రెండు రోజుల్లో వందలాది మంది అనుచరులు కూడా చేరతారని చెప్పారు.లింగాయత్ సీఎంలు అవినీతి చేశారని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్య కర్ణాటకను అవమానించడమేనని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లింగాయత్ ముఖ్యమంత్రులు అవినీతిపరులని చేసిన ప్రకటన ఖండించారు. ఇది కర్ణాటకను అవమానించడమేనని, దీనికి సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ప్రహ్లాద్ జోషి డిమాండ్ చేశారు. లింగాయత్ కమ్యూనిటీ విషయంలో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఇమేజ్‌ను రూపొందించడంలో బిజీగా ఉందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.కాగా, లింగాయత్ కమ్యూనిటీ నుండి అధికార బిజెపిని వదిలి వారంలోపే కాంగ్రెస్‌లో చేరిన రెండవ సీనియర్ నాయకుడు జగదీశ్ షెట్టార్. అంతకుముందు కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాడి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరూ కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికలలో షెట్టర్‌కు వ్యతిరేకంగా బిజెపి మహేష్ టెంగింకైని బరిలోకి దింపింది. మే 10న ఒకే దశలో 224 స్థానాలకు ఎన్నికలు నిర్వహించి మే 13న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ ఎన్నికల్లో లింగాయత్ ఓట్లే చాలా కీలక కావడంతో ఆ సామాజిక వర్గం ఇప్పుడు రాజకీయ అంశంగా మారింది.

# శ్రీశైలం లో ఆరెకటికల అన్నదాన సత్రం ప్రారంభించిన కేంద్ర మంత్రి

**శ్రీశైలం**

నంద్యాల జిల్లా శ్రీశైలంలో అఖిలభారత ఆరెకటిక శ్రీ సూర్య శివాజీ అన్నదాన సత్రం ప్రారంభోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నదాన సత్రం చైర్మన్ డబ్బికార్ శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి డా,,శ్రీ వీరేంద్ర కుమార్ ఖటిక్ సతీ సమేతంగా వచ్చి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుని తదుపరి అన్నదాన సత్రం రెండవ సెల్లార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మరియు గోల్డ్ మ్యాన్ కన్హయ్యలాల్ ఖటిక్,నేత్రమ్ రగేలా,భాగ్యలక్ష్మి , అఖిలభారత ఆరెకటిక సంఘ దక్షిణాది రాష్ట్ర సభ్యులయిన ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుండి ఆరెకటిక సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ, దక్షినాదిన ఉన్న ఆరెకటికలు వివిధ రంగాలలో అభివృద్ధి చెందాలని అందుకోసం కేంద్ర ప్రభుత్వం నుండి సహకారం అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు,మరియు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరెకటికలు ఎన్నో ఇబ్బందులు పడుతున్న విషయం తాను ఎన్నో సందర్భాల్లో స్వయంగా తెలుసుకున్నానని కావున ఆరెకటికలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగలన్నారు మరియు ఆరెకటికలను ఎస్సీలో కంటే ముందుగా బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలో చేర్చడానికి కేంద్రం ప్రభుత్వానికి సిఫార్సు చేసి త్వరితగతిన అమలయ్యే ఏవిధంగా కృషి చేస్తానన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాజస్థాన్ నుండి గౌరవ తిథిగా వచ్చిన గోల్డ్ మాన్ కన్హయ్య లాల్ ఖటిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈయనను ఏ బి కే ఎస్ సభ్యులు బి.కే.నాగేంద్ర, అభిలాష్ కలిసి అభినందించారు, వీరితో పాటు వివిధ సంఘాల,ట్రస్టుల నేతలు సభను ఉద్దేశించి మాట్లాడారు ఈ కార్యక్రమంలో అఖిల భారత ఆరెకటిక సంఘం జాతీయ యువజన ప్రధాన కార్యదర్శి బిడికికారి నాగేంద్ర రావు మరియు కార్యవర్గ సభ్యులు కార్యక్రమానికి వచ్చిన అతిధులను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన సత్రానికి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదివేల ఒక రూపాయలను డొనేషన్ ఇచ్చిన బిడికికారి నాగేంద్ర రావుకు అన్నదాన సత్రం చైర్మన్ డబ్బికార్ శ్రీనివాస్&ట్రస్ట్ సభ్యులు ప్రశంసా పత్రంతో అభినందించి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన సింగర్ లక్ష్మీబాయిని, శ్రీ సునామా జకినీ మాత ఆలయ ట్రస్ట్ సభ్యులు జ్ఞాపికతో సన్మానించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ఏ బి కే ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మురారికార్ ప్రశాంత్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ,ప్రధాన కార్యవర్గ సభ్యులైన హింగోలికార్ నవీన్, యువరాజ్, సుధీర్, గణేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రఘువీరా రీ ఎంట్రీ ఇచ్చినట్టేనా

**అనంతపురం :**

మూడు దశాబ్దాల పాటు ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నీలకంఠాపురం రఘువీరారెడ్డి నాలుగేళ్ళుగా సైలెంట్ అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ ఆయన్ను ఓటమి పలుకరించింది. అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలకంగా వ్యవహరించిన రఘువీరా రాజకీయ జీవితంపై రాష్ట్ర విభజన ప్రభావం బాగా పనిచేసింది. ఏపీలో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోవడంతో ఆ పార్టీ నాయకులను పట్టించుకునేవారే లేకుండా పోయారు. దీంతో రఘువీరా కూడా సైలెంట్‌గా రాజకీయాల నుంచి పక్కకు జరిగి సొంత గ్రామం అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠాపురంలో వ్యవసాయం చేసుకుంటూ ప్రశాంత జీవితం గడుపుతున్నారు. ఏపీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నాక పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నప్పటికీ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కర్నాటకలో సాగుతున్నపుడు ఆయన వెళ్లి పాదయాత్రలో పాల్గొన్నారు. ఇప్పుడు కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రావడంతో హఠాత్తుగా ఆయనకు రాజకీయాల మీద గాలి మళ్లింది. కాంగ్రెస్ హైకమాండ్ రఘువీరాను బెంగళూరు సిటీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతో ఆయనలో ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఈ నేపథ్యంలోనే తన స్వగ్రామం నీలకంఠాపురంలో కాంగ్రెస్



కార్యకర్తలతో రఘువీరా సమావేశం నిర్వహించారు. తాను మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు కార్యకర్తలను ఉద్దేశించి ప్రకటించారు. కర్నాటక ఎన్నికల్లో తాను చురుగ్గా పాల్గొనబోతున్నట్లు చెప్పిన రఘువీరా.. ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఏపీ రాజకీయాలపై మాత్రం ఆయన నోరు మెదపలేదు. గతంలో మాదిరిగా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తారా? లేదా అన్న విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికైతే కర్నాటక ఎన్నికల ప్రచారం మీదే ఆయన దృష్టి సారించారు. అక్కడ ఫలితాలు బాగుంటే తిరిగి ఏపీ రాజకీయాల్లో కూడా యాక్టివ్ అవుతారేమో చూడాలి. నాలుగేళ్ళుగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్న రఘువీరా ఇప్పుడు హఠాత్తుగా కర్నాటక ఎన్నికల రంగంలోకి దిగడం అనంతపురం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇప్పుడు ఎందుకు మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నారంటూ చర్చించుకుంటున్నారు.

# సత్తెనపల్లి టీడీపీలో త్రిముఖ పోటీ

**గుంటూరు:**

ఏ మాత్రం కొంచెం కష్టపడినా ఆ నియోజకవర్గం నుంచి విజయం సాధించడం సులభం. ఇప్పటికే స్థానిక ఎంఎల్‌ఏపై పలు ఆరోపణలు రావడం ప్రతిపక్షానికి ప్లస్... కానీ అక్కడ ఉన్న ప్రతిపక్ష పార్టీ నాయకులలో సీటు కోసం జరుగుతున్న గొడవలు అధిష్టానానికి చికాకు తెప్పిస్తున్నాయి. ఈ గ్రూప్ తగాదాలు ఆ పార్టీ అభిమనులలో సైతం నిస్తేజాన్ని నింపుతున్నాయి. నాయకులు ఏకతాటిగా నడవకపోతే విజయం సాధించే సీటును కోల్పోవడం తథ్యం మంటున్నారు నియోజకవర్గం ప్రజలు. పిట్టపోరు పిల్లి తీర్చిన చందంగా వీరికి జలక్ ఇచ్చి కొత్తగా పార్టీలో చేరిన సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ తెరమీదకు వచ్చారు.కోడెల మరణం తరువాత సత్తెనపల్లి నియోజకవర్గం పెద్దగా పరిచయం చేయనవసరం లేదు. 2014లో కోడెల శివప్రసాద్ ఈ నియోజకవర్గం విజయం సాధించి విభజిత ఆంధ్రప్రదేశ్ కు మొదటి స్పీకర్ గా విధులు నిర్వహించారు. 2019 లో కోడెలను ఓడించి అంబటి రాంబాబు ఇక్కడ నుంచి విజయకేతనం ఎగుర వేశారు. ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్నారు. టీడీపీ పార్టీ ?డిపోవడం ఆతర్వాత కోడెల మృతి తర్వాత సత్తెనపల్లి నియోజకవర్గానికి ఇంచార్జ్ నియామకం జరగలేదు.

నియోజకవర్గం ఇంచార్జ్ పదవికోసం ముగ్గురు ఆశావాహులు తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేసుకుంటున్నారు. తప్పు లేదు కానీ పార్టీ క్యాడర్ ను మూడు వర్గాలుగా చేసుకొని ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చివరకు దాడులు కూడా చేసుకుంటూ పార్టీ పరువును బజారుకు ఈడ్చారంటున్నారు పార్టీ అభిమానులు. కోడెల వారసుడుగా తనకే ఇంచార్జ్ పదవి కావలని కోడెల కుమారుడు శివరాం ఆశిస్తున్నారు. గతంలో ఎంఎల్ఏ గా పనిచేసిన అనుభవం ఉన్న వైవీ ఆంజనేయులు తను రేసులో ఉన్నానంటుండగా... ఆరంభం నుంచి పార్టీ కోసం కష్ట పడుతున్న తనకు ఏంతక్కువ అని టీడీపీ యువ నాయకుడు మల్లీ అడుగుతున్నారు.కోడెల శివప్రసాదరావు మృతి చెందిన నాటి నుంచి సత్తెనపల్లి నియోజకవర్గం లో టీడీపీ పార్టీ మూడు ముక్కల ఆటను తలపిస్తుంది. క్రమ శిక్షణకు మరో రూపం టీడీపీ పార్టీ అని చెప్పుకుటారు. కానీ ఇక్కడ మాత్రం క్రమశిక్షణ మాత్రం మచ్చుకు కూడా కనిపించడం లేదు. ముగ్గురూ ఏవరకి వారు పోటా పోటీగా పార్టీ కార్యక్రమాలను చేస్తు పార్టీ క్యాడర్ నే ఇబ్బంది పెడుతున్నారు. ఎన్నో సార్లు అదిష్టానం గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టాలని చూసింది.. ఈ ముగ్గుర్ని పిలిపించి మాట్లాడింది, అప్పటికి అధిష్టానం మాట శిరోధార్యం ఆనటం రెండు సంవత్సరాల నుంచి సత్తెనపల్లి టీడీపీలో ఇదే తంతు నడుస్తోంది..గతంలో వైవీ. ఆంజనేయులు టీడీపీ ఎంఎల్ఏగా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆతర్వాత పార్డీ నుంచి అవకాశం దక్కలేదు. 2014లో కోడెల సత్తెనపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించడం, 2019లో ?డిపోవడం జరిగింది. కోడెల మరణం తర్వాత లైమ్ లైట్ లోకి నచ్చాడు వైవీ. అదిష్టానం సత్తనపల్లి సీటు తనకే ఇస్తుందంటూ ప్రచారం చేసుకున్నారు. కోడెల మరణం తర్వాత ఆయన కుమారుడు యాక్టివ్ అయ్యారు. సీటు తనకే కావాలంటూ పార్డీ కార్యక్రమాలను చేయడం ప్రారంభించారు. సత్తెనపల్లి లో టీడీపీ కార్యాలయం ఉన్న కోడెల శివప్రసాద్ తన ఇంటి వద్దే పార్టీ కార్యక్రమాలు నిర్వహించేవారు. అదే సాంప్రదాయాన్ని కోడెల కుమారుడు కోడెవ శివరాం కొసాగించారు.పార్టీకీ సంబంధించిన కార్యక్రమాలను కోడెల శివరాం తన ఇంటి వద్ద నుంచి నిర్వహించగా... వైవీ ఆంజనేయులు సత్తెనపల్లి లోని టీడీపీ పార్టీ కార్యాలయం లో పార్డీ కార్యక్రమాలు పోటా పోటీగా నిర్వహించడం ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలు రెండు వర్గాలుగా చీలారు. కొంత మంది పార్టీ నాయకులు అయితే పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడమే మాను కొన్నారు.సత్తెనపల్లి లో అన్నా క్యాంటీన్ లను కూడా ఎవరికి వారు ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్ లో కోడెల శివరాం, పార్టీ కార్యాలయం సమీపంలో వైవీ ఆంజనేయులు ప్రారంభించారు. అయితే అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ సమయంలో గొడవ పడటం.... అన్నా క్యాంటీన్ ఏర్పాటును తెలియచేస్తూ ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను సహితం ఒకరివి మరొకరు చించి వేయడంతో పార్టీ అదిష్టానం సీరియస్ అయింది. పార్టీ కార్యక్రమాలు వర్గాలుగా విడిపోయి చేయడంతో పార్టీ క్యాడర్ లో క్రమశిక్షణ లోపించింది. ఈ సంఘటన నడుమ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను తప్పనిసరిగా పార్టీ కార్యాలయంలో నిర్వహించాలని ఆదేశించారు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ కోడెల శివరాం పార్టీ ఆఫీస్ లో కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్ళగా వైవీ వర్గం అడ్డుకుంది. ఈ సందర్భంగా రెండు గ్రూపులు కుర్చీలతో దాడి చేసుకొని పార్టీ పరువును బజారుకు ఈడ్చారని పార్టీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు.నాగార్జున సాగర్ కుడి కాలువకు నీరు విడుదల చేయక పోవడంతో ఆయకట్టు లక్ష ఎకరాలలో పంట ఎండిపోతుంది అంటు రైతులు ఆందోళన చెందారు. కుడి కాలవకు నీరు విడుదల చేయాలంటూ సత్తెనపల్లి టీడీపీ నాయకులు వైవీ ఆంజనేయులు, శివరాం, అబ్బూరి మల్లీ.. ఎవరికి వారు తమ గ్రూపులతో వెళ్ళి ఆందోళన చేశారు. వీళ్ళలో వీళ్ళకే ఐఖ్యత లేదు ఇక పార్టీని ఏమి కాపాడతారంటూ ప్రజలలో చర్చ మొదలైంది. ఆ తర్వాత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు సందర్భాలలో కూడా గ్రూపు రాజకీయాలు భగ్గుమన్నాయి. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను సైతం ఒకరి వర్గానివి మరొకరు చించివేశారు. స్థానిక ఎంఎల్ఏ మంత్రి అంబటి రాంబాబుపై ఈ ప్రాంతంలో కొంత వ్యతిరేకత ఇప్పటికే ఎస్టాబ్లిష్ అయింది. టీడీపీ పార్టీ పట్ల ప్రజలలో కొంత సానుకూలత ఉంది. ఇలాంటి పరిస్థితిలో కొద్దిగా కృషి చేసినా టీడీపీ విజయం సాధించడం సులభమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వర్గపోరుతో చేతులారా గెలిచే సీటును వదిలేస్తున్నారని టీడీపీ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.అయితే పార్టీలో రీసెంట్ గా జాయిన్ ఆయిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణను సత్తెనపల్లి నుంచి పోటీ చేయిస్తే పరిస్థితి ఏవిధంగా ఉంటుందని అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సత్తెనపల్లి పంచాయతీ ఎంత తొందరగా చేస్తే అంత మంచిదట. కాలక్షేపం చేస్తే అసలుకే మేసం రావడం ఖాయమంటున్నారు టీడీపీ అభిమానులు. ఈనెల 26 వ తేదిన సత్తెనపల్లిలో జరిగే ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి ప్రోగ్రామ్ లో చంద్రబాబు పాల్గోనున్నారు. అక్కడ జరిగే బహిరంగ సభలో నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ ని ప్రకటిస్తే ప్రాబ్లెమ్ సాల్వ్ అవుతోందా... ఏం జరుగుతుందో తెలియాలంటే ఒకట్రెండు వేచి చూడక తప్పదు.

# విశాఖ జైల్లో ఖైదీలకు జ్ఞాన సాగరం

**విశాఖపట్టణం:**

మీకు స్టూడెంట్ నెంబర్ వన్ సినిమా గుర్తు ఉంది కదా. అందులో జూనియర్ ఎన్టీఆర్ ఒక పక్క జైలు శిక్ష అనుభవిస్తూనే మరోప్రక్క లా చదువుతాడు. ఇప్పుడు విశాఖ సెంట్రల్ జైలులో అలా శిక్ష అనుభవిస్తూనే చదువుకుంటున్న వారిసంఖ్య పెరుగుతోంది. ఇందులో కో ఇన్సిడెంట్ ఏంటంటే స్టూడెంట్ నెంబర్ వన్ సినిమాలో జూనియర్ చదివేది కూడా విశాఖ జైలులోనే కావడం. ఆవేశంలో నేరాలకు పాల్పడి జైలు పాలయ్యేవారు ఎంతోమంది ఉన్నారు. అలాంటివారిలో తమ జీవితం ఇక జైలుపాలే అనుకోకుండా చదువుకుని రిలీజ్ అయ్యాక మెరుగైన జీవితం గడపాలనుకునే వారు చదువుపై దృష్టిపెడుతున్నారు. జైలు అధికారులు కూడా వారికి చదువుకునే అవకాశం కల్పించడంతో పాటు దానికి తగ్గ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. దానితో ఒక పక్క జైలులో రకరకాల పనులు చేసుకుంటూనే మరోపక్క చదువుకునే వారు ఎక్కువ అవుతున్నారని జైలు అధికారులు చెబుతున్నారు. వారిలో 10బిష్త్ర క్లాస్ నుంచి డిగ్రీ ,పీజీల వరకూ చదువుతున్న వారున్నారు. ఈ అకాడమిక్ ఇయర్ పరీక్షలు రాసినవారు 23 మంది ఉన్నారు. వీరు కాకుండా కంప్యూటర్ కోర్సులు నేర్చుకున్నవారు మరో 50 మంది వరకూ ఉన్నారు. గతంలో అంటే 2019-20లో 29 మంది, 2020-21లో 32 మంది , 2021-22 లో 17 మంది విశాఖ జైలు నుంచి తమ తమ చదువులు పూర్తి చేశారు. 2010లో అయితే లైఫ్ ఇంప్రెజన్మెంట్ శిక్ష అనుభవిస్తున్న ఒక ఖైదీ పీజీలో గోల్డ్ మెడల్ సాధించి సంచలనం సృష్టించాడు . ఈ జైలులో శిక్షలు పడినవారు, రిమాండ్ లో ఉన్నవారు తమ చదువు పాడు కాకుండా కొనసాగించే అవకాశం ఉంది. వారే కాదు అస్సలు చదువులేని వారు కూడా జైల్లో ఉంటారు. అలాంటి వారికోసం అడల్ట్ ఎడ్యుకేషన్ కింద చదువు చెబుతున్నారు. వారు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా 10బిష్త్ర క్లాస్ వరకూ చదువుకుంటున్నారు. డిగ్రీ ,పీజీలు చదివేవారికి క్లాసులు ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వారికోసం ప్రత్యేకంగా జైలు రిక్రూట్మెంట్ లో భాగంగా అపాయింట్ అయిన టీచర్ ఒకరు ఉంటారు. ఉదయం 8 నుంచి 11 వరకూ , మధ్యాహ్నం 1:30 నుండి 4 గంటల వరకూ ఖైదీలకు క్లాసులు ఉంటాయి. ఎగ్జామ్స్ టైంలో ఏయూ నుంచి వచ్చిన ప్రతినిధులే ఇన్విజిలేషన్ చేస్తారు. అలాగే కొన్ని కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో టెక్నికల్, కంప్యూటర్ ట్రైనింగ్ లు అందిస్తారు. ఇక ఈ జైలులో ఖైదీల కోసం "జ్ఞాన సాగరం " పేరుతో ప్రత్యేక లైబ్రరీని కూడా ఏర్పాటు చేశారు. ఏదేమైనా విశాఖ జైలులోని ఖైదీలకు చదువు పట్ల ఆసక్తి కలిగించడం లో అధికారులు తీసుకుంటున్న చర్యలు సక్సెస్ కావడంతో అందరి నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# పడిపోతున్న కోడిగుడ్ల ధర

**వరంగల్:**

ఒకవైపు కోళ్ల దాణా ధరలు ఆకాశాన్నంటుతుండగా మరో వైపు కోడిగుడ్ల ధర మాత్రం రోజురోజుకు పడిపోతున్నాయి .ఇంకోవైపు ఎండలు వేడిమి తట్టుకోలేక కోళ్లు మృతి చెందుతుండడంతో కోళ్ల ఫారాల యజమానులు నష్టాల ఊబిలో పడుతున్నారు.. పది సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా కోళ్ల పరిశ్రమ నష్టాల బాటలో నడుస్తుండడంతో పౌల్ట్రీ రైతులు తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు..ఒక్కసారిగా పెరిగిన దాణా రేట్లతో సతమతమవుతున్న కోళ్ల రైతుకు గోరుచుట్టుపై రోకలిపోటులా గిట్టు బాటుకాని విధంగా గుడ్డు ధర ఉండడంతో పరిశ్రమ నష్టాల బాట పట్టింది..మరో వైపు మండే ఎండలతో కోళ్లు మృత్యువాత పడటం జరుగుతుంది.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 కి పైగా కోళ్ల పరిశ్రమలు ఉండగా వీటిలో సుమారు 25 లక్షల వరకు కోళ్లను రైతులు పెంచుతున్నారు. ఇటీవల కాలంలో దాణా రేట్లు పెరగడం, గుడ్డు ధర మూడు రూపాయలకు చేరు కోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోళ్ల దాణా టన్ను రూ.18 వేల నుంచి రూ.30 వేలకు



చేరుకోవడం, అదేవిధంగా కోళ్ల మందుల రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ఒక్కొక్క కోడిగుడ్డు ఉత్పత్తికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు పైచిలుకుగా రోజు రోజుకు పెరగుతుండడంతో వేడిమి తట్టుకోలేక కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. .ఇంకోవైపు పెరిగిన విద్యుత్ చార్జీలు, కూలీలకు వేతనాలు, ఇతర ఖర్చులతో కలుపుకుని ఒక గుడ్డు ఉత్పత్తికి సుమారుగా రూ.4 ల వరకు ఖర్చవుతుంది.దీంతో ప్రస్తుతం మార్కెట్లో గుడ్డు ధర రూ.4.23 ఉన్నప్పటికీ రైతులకు మాత్రం రూ.2.95 లు మాత్రమే చెల్లిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు గుడ్డుకు ధర లేక పోవడం ఎగుమతులు అంతంత మాత్రంగా ఉండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం గా మారింది. ప్రస్తుత పరిస్థితిని బట్టి కొత్త బ్యాచ్‌లను వేసేందుకు కూడా రైతులు వెనకాడుతున్నారు.

# తెరపైకి రాయల తెలంగాణ డిమాండ్

**అనంతపురం:**

టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాయలసీమను తెలంగాణలో కలపాలని జేసీ డిమాండ్ చేశారు. రాయలసీమను తెలంగాణలో కలుపుకోవాల్సిన అవసరం సీఎం కేసీఆర్ కు ఉందన్నారు. రాయల తెలంగాణ అవ్వడానికి ఎవరికి అభ్యంతరం లేదన్నారు. ఈ విషయంపై నాయకులతో చర్చిస్తున్నామన్నారు. ఎన్నికల తర్వాత ఈ విషయంపై నేతలందరినీ కలుస్తానన్నారు. రాయలసీమను తెలంగాణలో కలిపినప్పుడే రాయలసీమ సాగునీటి సమస్య తీరుతుందన్నారు. రాష్ట్రాలను విడగొట్టడం కష్టమన్న జేసీ... కలపడం సులభమని వ్యాఖ్యానించారు. తమ వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటున్నారని, అది సాకారం అయితే మంచిదేననే జేసీ దివాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. "రాయలసీమను తెలంగాణలో కలపాలి. అప్పుడే రాయలసీమ సాగునీటి సమస్య తీరుతుంది. రాష్ట్రాన్ని విడగొట్టడం కష్టంగాని కలపడం సులభం. రాయలసీమను తెలంగాణలో కలిపితే ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేదు."- జేసీ దివాకర్ రెడ్డి రాష్ట్ర విభజన టైంలో రాయలసీమను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్లు వినిపించాయి. రాష్ట్ర విభజన జరిగి కూడా దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా రాయలసీమను తెలంగాణలో కలపాలని మళ్లీ డిమాండ్ తెరపైకి తేవడంపై రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు. ఏపీ విభజన సమయంలో కొంత మంది సీమ నేతలు రాయల తెలంగాణ ప్రతిపాదనలు తెచ్చారు. అయితే రాయల తెలంగాణ సాధ్యం కాలేదు. మళ్లీ ఇన్నేళ్లు తర్వాత జేసీ దివాకర్‌రెడ్డి రాయల తెలంగాణ అంశం తెరపైకి తేవడం సంచలనంగా మారిపోయింది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యక్షమైన జేసీ దివాకర్‌రెడ్డి.. తెలంగాణ వదిలిపెట్టి తాము నష్టపోయమాన్నారు. తాను ఏపీ వదిలేసి తెలంగాణకు వచ్చేస్తానని చెప్పుకొచ్చారు. అప్పట్లో తెలంగాణ అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసిన జేసీ.. కేసీఆర్ సీఎం అయ్యాక కలవలేదని, అందుకే కలుద్దామని వచ్చినట్లు చెప్పారు. ఏపీ కన్నా తెలంగాణలో పాలన బాగుందని మెచ్చుకున్నారు. రాజకీయ అంశాలు పక్కనబెడితే తాను రాయల తెలంగాణ కోరుకున్నానన్నారు. రాష్ట్రం విడిపోయాక రాయలసీమ నష్టపోయిందన్నారు. 2021లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి, టీడీపీ నేత జేసీ దివాకర్‌రెడ్డి కలిశారు. అప్పట్లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అక్కడకు వచ్చిన కేసీఆర్‌తో శాసనసభ ఆవరణలో జేసీ దివాకర్ రెడ్డి కలిసి పలు అంశాలపై మాట్లాడారు. అంతకు ముందు సీఎల్పీ కార్యాలయంలో భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి తదితరులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ నేత జానారెడ్డి గెలవడం కష్టమని ముందే చెప్పానన్నారు. ఆయన ఎందుకు ఓడిపోయారో అందరికీ తెలుసన్న ఆయన... తనకు జానారెడ్డి మంచి మిత్రుడని తెలిపారు. రాజకీయాలు బాగోలేవని, సమాజం కూడా బాగోలేదన్నారు. ఏపీ వదిలేసి తెలంగాణకు వస్తానన్నారు. తెలంగాణ వదిలిపెట్టి నష్టపోయామన్నారు. రాయల తెలంగాణ కావాలని నాడు జైపాల్‌రెడ్డిని అడిగితే ఒప్పుకోలేదని జేసీ వ్యాఖ్యానించారు. తాను రాజకీయంగా ఎదిగింది కాంగ్రెస్‌లోనే అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కలవలేదని తెలిపారు. అందుకే ఇప్పుడు కలిశానని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజనతో తమ ప్రాంతానికి అన్యాయం జరిగిందన్న ఆయన... రాయలసీమ కూడా తెలంగాణతో కలిసి ఉంటే బాగుండేదని కేసీఆర్‌తో చెప్పానని పేర్కొన్నారు.

# తీరనున్న గ్యాస్ బండ కష్టాలు

**తిరుపతి :**

ప్రజలకు గ్యాస్ కష్టాలు తీరనున్నాయి. సిలిండర్ బుక్ చేయడం..అది వచ్చేందుకు సమయం పట్టడం..ఈలోపు అవస్థలకు చెక్‌పడనుంది. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా దేశవ్యాప్తంగా చేపట్టే పైప్డ్ నేచురల్ గ్యాస్ పనుల్లో భాగంగా రూ.వంద కోట్ల బడ్జెట్‌తో తిరుపతి తిరుత్తణి మార్గంలో 75 కిలోమీటర్ల మేర గ్యాస్ పైప్‌లైన్ అమర్చుతున్నారు. ఏజీ అండ్ ప్రతమ్ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో లేబర్ కాంట్రాక్టర్ల ద్వారా గ్యాస్ పైప్ లైన్ల పూడిక పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. తిరుపతిలో ప్రారంభమైన పైపుల పూడిక పనులు ప్రస్తుతం నగరిలో కొనసాగుతున్నా యి. సమీపంలోని తిరుత్తణికి చేరుకుంటే పూడిక పనులు పూర్తయినట్లే.మెయిన్ సోర్స్ స్టేషన్ నుంచి గ్యాస్ సిటీ స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి జిల్లా రెగ్యులేటింగ్ స్టేషన్‌కు.. అక్కడి నుంచి ఇన్‌సైడ్ సొసైటీకి.. అక్కడి నుంచి నివాసాలకు సరఫరా అవుతుంది. నివాసాలకు వచ్చే గ్యాస్‌పైప్‌లైన్ తొలుత మీటర్ రెగ్యులేటర్‌కు అనుసంధానమై తదుపరి వంటగదిలోని సౌ పైపునకు కలుపుతారు. వాడకాన్ని అనుసరించి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.పైప్‌లైన్ పనులు అ?యతంత భద్రత ప్రమాణాలతో జరుగుతున్నాయి. ఈ పైపులను 1.7 మీటర్లు (సుమారు 6 అడుగుల) లోతులో అమర్చు తున్నారు. లీకేజీకి ఆస్కారం లేకుండా 16 ఇంచుల వ్యాసార్థం కలిగిన పటిష్టమైన 4 లేయర్‌ల వెల్డింగ్, 3 లేయర్ సేఫ్టీ ఉన్న పైప్ లైన్లను ఈ ప్రక్రియకు వాడుతున్నారు. పైప్ లైన్ మార్గంలో సూచికలను ఏర్పాటు చేస్తారు. ఇవి ఉన్న ప్రాంతంలో బోర్లు వేయడం, బావు లు తవ్వడం, చెట్లు నాటడం నిషేధం. పైపులై న్లు జాతీయ రహదారి పక్కనే వెళుతున్నాయి.పైప్‌లైన్ ఏర్పాటు పూర్తి అయిన తరువాత తిరుపతి, తిరుత్తణి మార్గంలో రెండు ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. గ్యాస్ పైపుల్లో పంపే ముందు రెండు సార్లు నీటిని పంపి అల్ట్రా సోనిక్ టెస్ట్ చేస్తారు. పూర్తి స్థాయిలో పైప్ లీకేజీ లేదని నిర్ధారణ అయిన పిదపే గ్యాస్‌ను సరఫరా చేస్తారు. గ్యాస్‌తో నడిచే వాహనాలకు ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద సరఫరా చేస్తారు.అగ్ని ప్రమాదాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, పరీక్షల అనంతరం ఫిల్లింగ్ స్టేషన్‌కు గ్యాస్ వచ్చేందుకు ఏడాది సమయం పడుతుంది. ఆపై ఇళ్లకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తాం. ప్రస్తు తం లక్నోలో పైప్‌లైన్ గ్యాస్ సరఫరా ప్రక్రియ పూర్తిస్థాయిలో పూర్తయి ఇంటింటికీ సరఫరా చేస్తున్నాం.

## పోలీసు కారు ఈడ్చుకెళ్లిన తాగుబోతు

**మిర్యాలగూడ**



నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం హనుమాన్ పేట ఫ్లైఓవర్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఓ మందుబాబు హల్ చల్ చేసాడు.డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ కు సహకరించకుండా కానిస్టేబుల్ లింగారెడ్డిని కారుతో 50 మీటర్లు ఈడ్చుకెళ్లాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ లింగారెడ్డికి గాయాలు అయ్యాయి. లింగారెడ్డిని ఆస్పత్రికి తరలించారు. కారు ఆపకుండా పరారైన వ్యక్తిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేసాడు. పోలీసులు కారు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## గడప గడపకు మన ప్రభుత్వం

**పెందుర్తి**

పరవాడ మండలం కన్నూరు పంచాయతీ మడకపాలెం గ్రామం లో గడప గడ పకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాధ్ , పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొన్నారు. సుమారు 76 లక్షల రూపాయలు నిధులు తో మంజూరైన మంత్రిపాలెం నుండి మడక పాలెం వరుకు నిర్మిస్తున్న బి.టి రోడ్డు ను ప్రారంభించారు. అనంతరం సుమారు 8.65 లక్షల రూపాయిల నిధులు తో అంగన్వాడీ భవనాన్ని పెందుర్తి ఎమ్మె ల్యే అదీప్ చేతుల మీదుగా ప్రారంభిం చారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపా తంగా పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేస్తున్న రాష్ట్రం ఏదయినా ఉందంటే అది ఒక్క ఆంధ్ర ప్రదేశ్ మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు.

## తప్పిన పెను ప్రమాదం

**పెందుర్తి**

పరవాడ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్దలారీ ట్రాలర్ నుంచి ఐరన్ స్తంభాలు జారీ పడ్డాయి. పరవాడ సింహాద్రి స్టీల్ కంపెనీ దగ్గర నుంచి రాంబెల్లీ ఎల్ అండ్ టి కంపెనీకి తరలిస్తున్న సమయంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద లారీ నుంచి ఐరన్ స్తంభాలు జారి పడ్డాయి. దాంతో వాహనదారులు ఉలిక్కిపడ్డారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీనిపై ఆర్టీవో అధికారులు ఈ ప్రమాదంపై ఎంక్వయిరీ చేసి ఇటువంటి భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా అక్కడున్న ప్రజలు కోరుతున్నారు. ఇటువంటి ప్రమాదాలు,మరియు జరక్కుండా చూడాలని ప్రజలు అంటన్నారు. ఘటనపై పరవాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## యువకుడి దారుణ హత్య

**మంచిర్యాల**



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం లో ముత్తే మహేష్ (24) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. గత కొన్ని నెలలుగా ఓ వివాహిత ను మృతుడు వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. వాహిత తరుపు బంధువులే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహేష్ ను నడి రోడ్డుపై రాళ్లతో కొట్టి చంపారు. గ్రామస్తులందరూ చూస్తుండగా దారుణం జరిగింది.

## పోలీసు స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ

**ఏలూరు**



ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి మంగళవారం నాడు సందర్శించారు. ఎస్పీగా నూతనంగా బాధ్యతల స్వీకరణ తరువాత ఆమె మొదటి సారి పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. సరిహద్దు ప్రాంతం కావడం తో గంజాయి, మద్యం అక్రమ రవాణా పై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు.

## పశ్నించే గొంతును అణిచివేయలేరు

**హైదరాబాద్**

చంచల్ గూడ మహిళ జైలులో రిమాండ్ లో ఉన్న షర్మిలను విజయమ్మ కలిసి పరామర్శించారు. అనంతరం జైలు వద్ద మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను ప్రభుత్వం నొక్కుతుందన్నారు. షర్మిల విద్యార్థుల కోసం పోరాడుతుంది. విద్యార్థుల భవిషత్తు నాశనం అయ్యింది. వేల కిలోమీటర్లు పాద యాత్ర చేసి ప్రభుత్వ వైఫల్యాలను విప్పి చూపించింది. ఆమె బయకు వస్తే పోలీసులు అడ్డుకొంటున్నారు. విద్యార్థులు సంయమనం పాటించాలని అన్నారు. షర్మిలమ్మ ఎవరికోసం పోరాడుతుందో ప్రజలందరూ గమనించాలి. ప్రశ్నించే గొంతును అణిచివేస్తే.. ప్రజలే ప్రశ్నించే రోజు వస్తుంది. పోలీసుల అత్యుత్సాహం వలనే ఇలా జరిగింది. దేవుడు ఆశీస్సులు , ప్రజల ఆశీస్సులతో బెయిల్ వస్తుందని ఆశిస్తున్నా. బెయిల్ పై విడుదల అయ్యాక కుడా షర్మిల మళ్ళీ ప్రజల సమస్యలపై పోరాడుతుంది , ప్రశ్నిస్తుందని ఆమె స్పష్టం చేసారు.

# పార్లమెంట్ ఎన్నికలపై పక్కా ప్లాన్

**హైదరాబాద్ :**

అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు పక్కా వ్యూహంతో ఉన్నట్లు కనబడుతోంది. 2024 ఏప్రిల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవ్వాలని కొంతమంది మంత్రులకు కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులకు సూచించారు. మరికొంత మంది ఎంపీలకు పార్టీ నాయకత్వ సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. మంత్రులు మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జి. జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులను ఎంపీలుగా పోటీ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ స్థాపన దినోత్సవం తర్వాత పోటీదారుల విషయం మరింత క్లారిటీ వస్తుందని తెలుస్తోంది. 2024లో కనీసం తొమ్మిది లోక్‌సభ స్థానాలకు పోటీ చేయడానికి నేరుగా మంత్రులను రంగంలోకి దించాలని సీఎం నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మల్కాజిగిరి, సికింద్రాబాద్, నల్గొండ లోకసభ స్థానాలకు మంత్రులను రంగంలోకి దించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. , మహబూబ్ నగర్, కరీంనగర్, వరంగల్, నాగర్ కర్నూల్, మహబూబాబాద్ , చేవెళ్ల. లోక్‌సభ ఎన్నికల కోసం మంత్రులతో పాటు అసెంబ్లీ, మండలిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లను కూడా ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారు.బీఆర్ ఎస్ ఇప్పటి వరకు నల్గొండ, సికింద్రాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోలేదు. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేసింది. మెదక్ ఎంపీ కొత్త కోట ప్రకాశ్ రెడ్డి వరుసగా రెండు సార్లు గెలిచారు. 2014లో మొదటి సారి, 2019లో రెండోసారి గెలుపొందారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించాలనే లక్ష్యంతో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలపై సీఎం ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. 2024లో మొత్తం 16 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవాలనే లక్ష్యంతో సీఎం "మిషన్-16" లక్ష్యాన్ని నిర్దేశించారు, మిగిలిన ఒక్క హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని దాని మిత్ర పక్షమైన మజ్లిస్ కే వదిలివేసారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ రాజకీయాల్లో పార్టీ తన ప్రభావాన్ని చూపాలంటే తెలంగాణలో లోక్‌సభ న్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాల్సిందేనని కేసీఆర్ గట్టి అభిప్రాయం. 2019 లోక్‌సభ ఎన్నికలకు సీఎం మిషన్-16 లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, కేవలం 9 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగారు. పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది.టీఆర్ఎస్ 2014లో 11 లోకసభ స్థానాలలో గెలుపొందింది. 2019లో టీఆర్ఎస్ 9 స్థానాలకు పడిపోయింది. అసెంబ్లీ , లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను మార్చినట్లయితే దీనికి చెక్ పెట్టవచ్చని బీఆర్ఎస్ నాయకత్వం అభిప్రాయ పడుతోంది.

# ప్రగతి భవన్ వర్సెస్ రాజభవన్...పార్ట్ 2

**హైదరాబాద్:**

తెలంగాణలో ప్రగతి భవన్ వర్సె?స్ రాజ్ భవన్ వివాదం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించడంలేదని గవర్నర్ తమిళిసై తరచూ వ్యాఖ్యలు చేస్తున్నారు. మరోసారి గవర్నర్ సీఎం కేసీఆర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ నిబంధనల ప్రకారం పాటించాల్సిన ప్రోటోకాల్ అమలు చేయడంలేదని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 167 ప్రకారం సీఎం, గవర్నర్ మధ్య తరచూ చర్చలు జరగాలని కానీ తెలంగాణలో ఆ పరిస్థితిలేదన్నారు. అందుకు తాను కారణం కాదన్నారు. సీఎం, గవర్నర్ మధ్య సత్సంబంధం ఉండాలని, కానీ రెండేళ్లుగా సీఎం కేసీఆర్ తనకు కలవలేదన్నారు. పెండింగ్ బిల్లులపై నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.గవర్నర్ తమిళిసై ఉద్దేశపూర్వకంగా బిల్లులు పెండింగ్ లో పెడుతున్నారని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సమయంలో తమిళిసై పెండింగ్ బిల్లులపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడు పెండింగ్ బిల్లులను గవర్నర్ క్లియర్ చేశారు. ఇందులో ఒక దానిని తిరస్కరించగా, మిగిలిన రెండు బిల్లులకు సంబంధించి ప్రభుత్వాన్ని గవర్నర్ వివరణ కోరారు. తమ వద్ద ఎలాంటి బిల్లులు పెండింగ్ లో లేవని రాజ్ భవన్ ప్రకటన విడుదల చేసింది. పెండింగ్ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా గవర్నర్ కు సూచించింది. తెలంగాణలో రాజ్ భవన్, ప్రగతి భవన్ మధ్య మంచి సంబంధాలు లేవు. ఈ విషయంపై గవర్నర్ తమిళి సై బహిరంగంగానే స్పందిస్తున్నారు. ప్రోటోకాల్ పాటించడంలేదని, అధికారులు ఎవరూ తనను కలవడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానిం చలేదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు తనకు ఎలాంటి ఆహ్వానం లేదన్నారు. ఆహ్వానం అంది ఉంటే, ఇలాంటి కార్యక్రమానికి తాను కచ్చితంగా హాజరవుతానన్నారు .తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్ మధ్య వివాదం ఇటీవల బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన పరిణామాలతో ముగిసి పోయిందని భావించారు. కానీ పెండింగ్ బిల్లులపై తెలంగాణ ప్రభుత్వం అనూహ్యంగా సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో గవర్నర్, ప్రభుత్వం మధ్య వివాదం ముగియలేదని స్పష్టమైంది. బిల్లులపై ప్రభుత్వం కోర్టుకు వెళ్లడంతో వివాదం మరింత ముదిరినట్లయింది. ఈ వివాదంపై గవర్నర్ అప్పట్లో స్పందిస్తూ.. దిల్లీకి వెళ్లే బదులు రాజ్ భవన్‌కు రావాల్సిందని సీఎస్ ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది.

# అదానీ, చైనా, ఇతర అంశాలపై "మౌన్ కీ బాత్" నడుస్తోంది

**న్యూఢిల్లీ :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలవారీ రేడియా ప్రోగ్రాం "మన్ కీ బాత్" 100వ ఎపిసోడ్ ఈనెల 30న నభూతో నభవిష్యతి అన్న రీతిలో ప్రసారం చేసేందుకు బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తుండగా, ఈ ప్రోగ్రాంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ వ్యంగ్యోక్తులు సంధించారు. అదానీ, చైనా, ఇతర అంశాలపై "మౌన్ కీ బాత్" నడుస్తోందని అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు."పీఎం శక్తివంతమైన పీఆర్ యంత్రాంగం 'మన్ కీ బాత్' 100 ఎపిసోడ్ అంటూ ఊదరగొడుతోంది. మరోవైపు అదానీ, చైనా, సత్యపాల్ మాలిక్ వెల్లడించిన అంశాలు, ఎంఎస్ఎంఈల విధ్వంసం, ఇతర కీలక అంశాలపై 'మౌన్ కీ బాత్' నడుస్తోంది" అని జైరామ్ రమేష్ ఆ ట్వీట్‌లో విమర్శించారు.మోదీ 'మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్‌ను దేశవ్యాప్తంగా ప్రసారం చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేసే బాధ్యతను కేంద్ర మంత్రులు, ఎంపీలకు అప్పగించింది. ఆరోజన జరిగే వివిధ కార్యక్రమాల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు నేతలు పాల్గొంటారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం రూ.100 నాణేలను కూడా విడుదల చేస్తోంది.దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని చేపట్టిన 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం ఇప్పటి వరకూ 99 ఎపిసోడ్లు పూర్తి చేసుకుంది. స్వచ్ఛ భారత్, బేటీ బచావో బేటీ బడావో, వాటర్ కన్జర్వేషన్, ఆయుష్, ఖాదీ తదితర అంశాలు ఆయా ఎపిసోడ్‌లో ప్రస్తావించడం, అంతగా గుర్తింపునకు నోచుకోని వ్యక్తులను వెలుగులోకి తేవడం సహా అనేక అంశాలతో ఈ రేడియో ప్రోగ్రాం జనబాహుళ్యానికి దగ్గరైంది. 2014 అక్టోబర్ 3న 'మన్ కీ బాత్' కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి నెలా చివరి ఆదివారం మధ్యాహ్నం 11 గంటలకు ఆల్ ఇండియా రేడియా, డీడీ నెట్‌వర్క్‌లో 'మన్ కీ బాత్' ప్రసారం అవుతోంది.100వ ఎపిసోడ్‌ను దేశవ్యాప్తంగానే కాకుండా వివిధ దేశాల్లో లైవ్ ప్రసారం చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గొడుగులకు భక్తుల నీరాజనాలు

**బద్వేలు**



నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనలో వెలిసి ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి గొడుగులకు బద్వేల్ లో భక్తులు నీరాజనాలు పలుకుతున్నారు స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మే మాసంలో జరుగుతాయి ఈ ఏడాది వచ్చేనెల ఒకటో తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఏడవ తేదీ వరకు జరుగుతాయి స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో ఈ గొడుగులు భక్తులు తీసుకువస్తారు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి సమీపంలో ఉండే గ్రామాల భక్తులు ఎంతో పవిత్రంగా స్వామివారి గొడుగులు తయారు చేసుకొని అంతే పవిత్రంగా బృందాలుగా ఏర్పడి పట్టణాలకు గ్రామాలకు వెళతారు ఈ ఆచారం చాలా దశాబ్దాలుగా సాగుతుంది స్వామివారి గొడుగులు వచ్చిన ప్రాంతంలో భక్తులు నీరాజనాలు పలకడంతోపాటు తమకు తోచిన విధంగా కానుకలు సమర్పిస్తారు బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి రెండు మూడు రోజుల ముందు వరకుఇలా ఊరు రా తిరిగి భక్తులు ఇచ్చిన కానుకలు తీసుకొని తిరిగి కాలినడకన పెంచలకోనకు చేరుకుంటారు ప్రజలు ఇచ్చిన కానుకలు స్వామివారికి సమర్పిస్తారు ఏది ఏమైనా బద్వేల్ ప్రాంతంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి గొడుగులకు ఒక ప్రత్యేకత ఉంది బద్వేలు నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి భక్తులు ఉండడం విశేషం

## వేడుకగా గులాబీ జెండా పండుగ

**నిర్మల్**

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ నియోజకవర్గంలో ఊరు వాడల గులాబీ జెండా పండుగ ను వేడుకగా జరుపుకున్నారు.. పల్లె, పట్నం అనే తేడా లేకుండా పండుగా వాతావరణంలో బీఆర్ఎస్ జెండా వేడుకను నిర్వహించారు. నిర్మల్ పట్టణంలో పలు వార్డుల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. బుల్లెట్ బండి నడుపుతూ పట్టణమంతా కలియతిరిగారు. అంతకుముందు శాస్త్రి నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ పట్టణ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నాయి

## బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో పాల్గొన్న మంత్రి

**బాల్కొండ**

బాల్కొండ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతినిధుల సభలో పాల్గొనే ముందు బాల్కొండ నియోజకవర్గ మండలాల వారిగా ఏర్పాటు చేసిన ప్రతినిధుల పేర్ల నమోదు,సభ,పార్టీకి సంబంధించిన కిట్ లు అందజేసే స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు. వేల్పూర్ మండల స్టాల్ లో తన పేరు నమోదు చేసుకుని ప్రతినిధుల సభ ఐడి కార్డు తీసుకున్నారు. సభా ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసారు. బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి,తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. తెలంగాణ అమరవీరులకు నివాళిగా సభ గా 2నిమిషాలు మౌనం పాటించింది. సభా ప్రాంగణమంతా కలియతిరుగుతూ బిఆర్ఎస్ శ్రేణులను మంత్రి ఆత్మీయంగా పలకరించారు.

## ఉగాది పురస్కారాలు ప్రధానోత్సవం

**గుంటూరు,**

ఉగాది పురస్కారాలు ? 2023 ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. మంత్రి మాట్లాడుతూ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పురస్కార గ్రహీతలందరికీ పేరు పేరునా నా అభినందనలని అన్నారు. విద్యా, శాస్త్ర సాంకేతిక రంగంలో పి. గోపీకృష్ణ, వైద్య రంగంలో డాక్టర్ ఆళ్ళ గోపాలకృష్ణ గోఖలే, లలిత కళలలో పసుమర్తి పావని, జానపద, నాటక రంగంలో కురటి సత్యం నాయుడు, వ్యవసాయం రంగంలో వి. గోపిచంద్, సేవా రంగంలో మాదిరెడ్డి కొండారెడ్డి, ప్రత్యేక కేటగిరి కింద చిత్రకళలో ఆర్. సుభాష్ బాబు పురస్కారాలందుకున్నారు

## అత్తమామల హత్యకు అల్లుడు స్కెచ్

**సంగారెడ్డి**

కరెంట్ షాక్ తో అత్తమామలని హత్య చేయాలని స్కెచ్ వేసిన అల్లుడు అరెస్ట్ అయ్యాడు.ఇంటికి వస్తే పిలిస్తే పలకలేదన్న కొపంతో అత్తమామలను చంపాలని అల్లుడు రమేష్ ప్లాన్ వేసాడు. ఘటన నారాయణ్ ఖేడ్ మండలం సంజీవన్ రావు పేట గ్రామంలో జరిగింది. ఈ నెల 12న అందరూ పడుకున్నాక మీటర్ నుంచి ఇంటి తలుపులకు కరెంట్ కనెక్షన్ పెట్టాడు. పొలం దగ్గర ఉన్న రెండు బోరు మోటర్లను నిందితుడు వరిగడ్డి వేసి తగలబెట్టాడు. ఉదయం లేచి తలుపు తిస్తే ఇంట్లో ఉన్న తల్లికూతుర్లకు కరెంట్ షాక్ కొట్టింది. వారు కేకలు వేయడంతో స్థానికులు గమనించి విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో ప్రమాదం తప్పింది. విచారణలో అల్లుడే నిందితుడని పోలీసులు తేల్చారు. హత్యకు ప్లాన్ చేసిన అల్లుడు రమేష్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు.

## ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

**కామారెడ్డి**

రాజంపేట మండలం పెద్దాయిపల్లి లో దారుణం జరిగింది. భార్య తన ప్రియుడితో కలిసి భర్త ను హత్య చేసింది. తన అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్త లింగం ను ప్రియుడు గోవింద్ తో కలిసి భార్య లావణ్య హతమార్చింది. కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తి, బైకు, 3 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు

## ఆటో, కారు ఢీ..ఇద్దరు మృతి

**ఖమ్మం**

ఖమ్మం జిల్లా ఏన్కూరులో ఆటో ను ఒక కారు ఢి కొట్టింది. ఘటనలో పదకొండు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కల్లూరు కు చెందిన వెంకటమ్మ , వరమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు.

## యువతి స్పాట్ డెత్

**విశాఖపట్నం**

విశాఖపట్నం కంబాల కొండ జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

ప్రజాతపన
prajathapana.com

# నల్గొండ కాంగ్రెస్ లో గందరగోళం

**నల్గొండ :**

తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్య నేతల మధ్య వర్గపోరు పతాక స్థాయికి చేరుతోంది. పరస్పరం చెక్ పెట్టుకునే పనిలో ఉన్నారు అంతా. ప్రస్తుతం పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మాజీ చీఫ్ ఉత్తంకుమార్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరు ఉంది. ఈ వార్‌లో మరో నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తంతో కలిసి సై అంటున్నారట. ఈ ముగ్గురి మధ్య ఎప్పుడూ ఏదో ఒక వివాదం తెరమీదికి వస్తోంది. రేవంత్‌కి చెక్ పెట్టడానికి ఉత్తమ్ శిబిరం? ఉత్తమ్ శిబిరాన్ని ఆపడానికి రేవంత్ వర్గం ఎప్పటికప్పుడు పావులు కదుపుతూనే ఉన్నాయి. నల్గొండలో ముందు నిరుద్యోగ నిరసన సభ వాయిదా పడడం? ఆ తరువాత తేదీని ఖరారు చేయడం వెనక కూడా ఎత్తుగడలు ఉన్నాయట. ఈనెల 28న నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిరుద్యోగ నిరసన సభను నిర్వహించాలని డిసైడ్ అయింది టి కాంగ్రెస్. ఉత్తమ్? రేవంత్ మధ్య ఉన్న గ్యాప్‌ని తగ్గించేందుకు ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్ ఇలా సయోధ్య కుదిర్చారట.నల్గొండ సభ ప్రకటన వెనక రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారన్న చర్చ పార్టీలో జరుగుతోందట. ప్రస్తుతం ఈ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఉత్తంకుమార్ రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిజానికి నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ ఓడిపోవడంతో తర్వాత భువనగిరి లోక్‌సభ సీటులో పోటీ చేసి గెలిచారు. దీంతో లోకల్ ఎంపీ గనుక ప్రస్తుతానికి నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గం ఉత్తంకుమార్ రెడ్డి పరిధిలోకి వెళ్ళింది. ఈ లెక్కన నిరుద్యోగ సభ నిర్వహణకు సంబంధించిన విషయాన్ని రేవంత్ రెడ్డి ఉత్తమ్‌తో చర్చించి తేదీలను ప్రకటించి ఉండాల్సింది. అందుకు తగ్గట్టే తాము సమాచారం ఇచ్చామని రేవంత్ వర్గం చెబుతుంటే?. ఉత్తంకుమార్ రెడ్డి మాత్రం నాకేం తెలియదంటున్నారు. పీసీసీ చీఫ్‌ని ఇప్పటిదాకా నల్గొండకు రాకుండా అడ్డుకుంటున్నారు ఉత్తమ్. అదే విషయాన్ని సభ పేరుతో తెరమీదికి తెచ్చి చర్చ పెట్టిందట రేవంత్ టీం. ఎంపీగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి సొంత అసెంబ్లీ నియోజకవర్గం హుజూర్నగర్. అలాగే భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత నియోజకవర్గం నల్గొండ. అంటే.. ఈ ఇద్దరు నాయకుల చేతిలోనే జిల్లా పార్టీ మొత్తం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళ్ళాలన్నా.. ఈ ఇద్దరి పరిధిలోకే వస్తుంది. దీంతో వాళ్ళని కాదని ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. కాబట్టి ఇద్దరు ఎంపీల సొంత నియోజకవర్గాలను ఫిక్స్ చేసేందుకే పీసీసీ చీఫ్ కొత్త ఎత్తుగడ వేశారంటున్నాయి పార్టీ వర్గాలు. నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గం నాదే అంటూ వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేస్తామని ప్రకటించేశారు కోమటిరెడ్డి. ఉత్తమ్ కుమార్ హుజూర్‌గనర్‌కు వెళ్తారా? లేక తిరిగి నల్గొండ ఎంపీగా పోటీ చేస్తారా అన్నది తేలాల్సి ఉంది. అలా ఇద్దరు నాయకులని ఏదో ఒక నియోజకవర్గానికి ఫిక్స్ చేసే ఎత్తుగడలో రేవంత్ ఇలాంటివి వ్యూహాన్ని వేశారా..? అనే చర్చ కూడా నడుస్తోందట పార్టీలోమునుగోడు ఉప ఎన్నిక టైంలో మొత్తం బాధ్యత పీసీసీ అధ్యక్షుడిదేనని.. అన్నీ ఆయనే చూసుకోవాలని చెప్పిన నేతలు? సమస్యలపై ఆందోళన చేసే విషయంలో మాత్రం తమ పరిధి అని చెప్పడం ఏంటన్నది రేవంత్ శిబిరం నుంచి వస్తున్న ప్రశ్న. తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు జరిగినా పట్టించుకోని నేత పీసీసీ చీఫ్ గా జిల్లాకు వెళ్తానంటే అభ్యంతరాలు చెప్పడం ఏంటన్నది రేవంత్ వర్గం ప్రశ్న. ఇప్పుడు సభ ద్వారా ఆ విషయాన్ని చర్చకు పెట్టగలిగామనుకుంటున్నారట ఆ వర్గం నాయకులు. మరోవైపు పీసీసీ చీఫ్‌గా కార్యక్రమాలు ప్రకటించే స్వేచ్ఛ ఉంటుంది.. కానీ ఎక్కడ నిర్వహిస్తున్నారో? స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం సరికాదంటున్నారు పార్టీలో కొందరు సీనియర్లు.. ఏదేమైనా? తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ముగ్గురు నాయకుల మధ్య ఎత్తులు పై ఎత్తులు కొనసాగుతున్నాయి. సందు దొరికితే చాలు? ఒకరికొకరు చెక్ పెట్టుకునే పనిలో ఉన్నారు. నాయకుల మధ్య పంచాయతీతో క్యాడర్‌లో గందరగోళం పెరుగుతోందటతెలంగాణ కాంగ్రెస్‌లో మూల స్తంభాల్లాంటి నాయకుల మధ్య పెరుగుతున్న పోరు ఎందాకా వెళ్తుందో?. ఎన్నికల టైంలో పార్టీని ఎటు తీసుకువెళ్తుందోనన్న టెన్షన్ కార్యకర్తల్లో పెరిగిపోతోందట. ఎన్నికల ఏడాదిలో అందర్నీ కలుపుకుని పోవాల్సిన వారే? ఇలా కలహించుకుంటుంటే? ఇక అధికారం గురించి ఆలోచన వస్తుందా అని అంటున్నారట ద్వితీయ శ్రేణి నాయకులు. పీసీసీ మిగతా నాయకుల్ని కలుపుకుని పోవడం లేదా? లేక మిగతా వారే పీసీసీతో కలిసి రావడం లేదా అని చర్చించుకుంటున్నాయట పార్టీ వర్గాలు.

# మంట పుట్టిస్తున్న సిమెంట్ ధరలు

**హైదరాబాద్ :**

నిర్మాణరంగానికి ప్రధానంగా అవసరమయిన సిమెంట్ మంట పెడుతోంది. ధరలు భగ్గమంటున్నాయి. ఈ నెలలోనే మరో 50 రూపాయల వరకు ధర పెరుగుతుందని క్రిసిల్ అంచనా వేస్తోంది. ఇప్పటికే భారీగా ఉన్న సిమెంట్ ధరలతో ఇంటి నిర్మాణం తడిసి మోపెడవుతోంది. సిమెంట్ ధరలు మరోసారి భారీగా పెరగనున్నాయి. ఈ నెలలోనే బస్తాపై 25 నుంచి 50 రూపాయల వరకు పెరగొచ్చని క్రిసిల్ అంచనా వేస్తోంది. సిమెంట్ తయారీలో ఉపయోగించే బొగ్గు, పెట్రోలియం కోక్ గత 6 నెలల్లో 30 నుంచి 50 శాతం పెరిగాయి. దీంతో సిమెంట్ ధరలు కూడా భారీగా పెరగొచ్చంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కారణంగా బొగ్గు, పెట్‌కోక్, పెట్రోలియం దిగుమతుల భారం పెరుగుతోంది. ప్రస్తుతం బస్తా సిమెంట్ బ్రాండ్ ను బట్టి 350 నుంచి 450 రూపాయల వరకు ఉంది. ఈ నెలలోనే మరో 25 నుంచి 50 రూపాయలు పెంచేందుకు కంపెనీలు రెడీ అవుతున్నాయని తెలుస్తోంది.మార్చి క్వార్టర్‌లో పెట్ కోక్ ధరలు అంతర్జాతీయంగా 43 శాతం పెరిగాయి. దేశీయ పెట్ కోక్ ధరలు మార్చిలో 26 శాతం, ఏప్రిల్‌లో 21 శాతం మేర పెరిగాయి. పెట్‌కోక్ దిగుమతి వ్యయం ఏడాది క్రితంతో పోలిస్తే ఒక్కో టన్నుపై 130 డాలర్ల మేర పెరిగింది. ఆస్ట్రేలియాలో వాతావరణం అనుకూలించక, ఇండొనేషియాలో నిషేధం వల్ల బొగ్గు ఎగుమతులు తగ్గాయి. దీంతో ధర పెరిగింది. క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 115 డాలర్ల వరకు పెరిగింది. ఇండియాలో బల్క్ డీజిల్ లీటర్‌పై 25 రూపాయలు పెంచారు.రిటైల్ ధర కూడా మార్చి నుంచి 10 రూపాయల వరకు పెరిగింది. సిమెంట్ రవాణా 50 శాతం వరకు రోడ్లపైనే జరుగుతోంది. పెరిగిన డీజిల్ ధరల కారణంగా రవాణా ఖర్చులు, పెట్‌కోక్, బొగ్గు ధరల పెరుగుదల కారణంగా ఉత్పత్తి, ప్యాకేజింగ్ ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ వినియోగం 5-7 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా. దేశీయ సిమెంటు వినియోగంలో 60 శాతం ఇళ్ల నిర్మాణానికే వెళ్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరం ఫస్ట్ హాఫ్‌లో సిమెంట్‌కు 20 శాతం గిరాకీ పెరిగింది. అయితే సెకండాఫ్‌లో అకాల వర్షాలు, ఇసుక, కూలీల కొరతతో 7 శాతం మేర తగ్గింది. అయితే ఈసారి నిర్మాణ ఖర్చు భారీగా పెరగడంతో సిమెంట్ గిరాకీ తగ్గొచ్చని ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు.

# యదేచ్ఛగా నకిలీ విత్తనాలు

**అదిలాబాద్ :**

ఏటా ఇదేతంతు జరుగుతున్నా అధికారుల నిఘా కొరవడుతుంది. విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు గ్రామాల్లోకి ఇప్పటికే వచ్చిచేరాయి. పోలీసుల తనిఖీలలో కొన్నే బయటపడుతున్నాయి. రైతులకు చేరాల్సినవి చేరిపోతున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాలో కొన్నిప్రాంతాలపై నకిలీ విత్తనాలు దాడి చేస్తున్నాయి. మారుమూల గ్రామాలను అక్కడి రైతులను మచ్చిక చేసుకుని నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఒక్కరోజు తనిఖీలు చేపడితే ఒక క్వింటాల్ 18 కిలోల నకిలీవిత్తనాలు దొరికాయంటే ఏమేరకు నకిలీ రాయుళ్ళు వేళ్లూనుకుపోతున్నారో అర్థం అవుతుంది. మంచిర్యాలజిల్లా తాండూరు .భీమిని ,నెన్నెల, కన్నెపల్లి మండలంలోని రైతులు పెద్ద ఎత్తున విత్తనాలు నిల్వచేశారు. తాండూర్ మండలంలో ఓవ్యాపారి ఏటా కోట్ల వ్యాపారం చేస్తున్నారనే విషయం ప్రచారంలో వుంది. గతంలో రెండు మూడుసార్లు పట్టుబడ్డా ఇప్పటికీ ఆ వ్యాపారం వదల్లేదు. తాండూరు ,రెబ్బన,తిర్యాణి మండలాలకు సైతం ఇక్కడినుంచే విత్తనాల సరఫరా జరుగుతుంది. వీరికి కొందరు పోలీసులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి నకిలీ విత్తనాలు అరికట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ మూడు మండలాల్లో 118 కిలోల నకిలీ పత్తివిత్తనాలు సీజ్ చేశారు.బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలుర రైసుమిల్లులలో నిల్వ ఉంచారని సమాచారం అందగా అక్కడికి వెళ్ళేలోపే విత్తనాలు మాయం చేశారట. అయితే ఎవరో సమాచారం అందించారని ప్రత్యేక టీంలు భావించాయి. అక్కడ ఏటా ఆంధ్రప్రదేశ్ నుంచి కొంతమంది రైతుల ముసుగులో ఇక్కడికి వచ్చి హెచ్ జీ కాటన్ సీడ్స్ సేల్ చేస్తున్నారని తెలిసింది. ఇప్పుడు నిల్వలు ఏర్పాటుచేయటంతో పాటు పలు గ్రామాల్లో రైతులకు అంటగట్టినట్టు తెలిసింది. తాజాగా నెన్నెల , తాండూర్, భీమిని పరిధిలోనే 118 కిలోల నకిలీ విత్తనాలు దొరికాయని, వీటిపై విచారణ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.వ్యవసాయశాఖ నిఘా లేకపోవడంతో అక్రమార్కులు విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది రెండు పీడీయాక్ట్ లు, 20 కేసులు నమోదుచేశామని అధికారులు చెబుతున్నారు. మళ్ళీ నకిలీ విత్తనాలు నిల్వచేయడంతో కలకలం రేగుతోంది. టాస్క్ ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఏదో చేస్తాం అని చెప్పినా నకిలీ రాయుళ్ళ ఆగడాలు మాత్రం ఆగడం లేదు. గతంలో కేసుల్లో వున్నవారు అదే పని మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు. అధికారులు పకడ్బందీ చర్యలు చేపటకపోతే రైతులు భారీగా నష్టపోక తప్పదంటున్నారు

# మంత్రి వర్సెస్ మాజీ మంత్రి

**వరంగల్ :**

ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డోర్నకల్ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. ఎస్టీ రిజర్వుడు స్థానమైన డోర్నకల్‌లో అదే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతల మధ్య రాజకీయ వైరం మూడు దశాబ్దాలకు పైగా సాగుతోంది. ప్రస్తుతం ఆ ఇద్దరు నేతలు అధికార పార్టీలో ఉన్నా, రాజకీయ వైరం మాత్రం తగ్గడంలేదు. రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్... మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ల మధ్య అధిపత్యపోరు తారా స్థాయికి చేరింది.ఒకప్పుడు సత్యవతి రాథోడ్ టీడీపీ నుంచి, రెడ్యానాయక్ కాంగ్రెస్ నుంచి రాజకీయ ప్రత్యర్థులుగా తలపడ్డారు. 1989 నుంచి 2018 వరకు డోర్నకల్ నియోజకవర్గానికి ఏడుసార్లు ఎన్నికలు జరుగగా ఆరుసార్లు రెడ్యానాయక్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడుసార్లు 1989, 2009, 2014లో సత్యవతి రాథోడ్‌తో రెడ్యానాయక్ తలపడ్డారు. ఒక్కసారి మాత్రమే 2009లో సత్యవతి చేతిలో రెడ్యానాయక్ ఓటమి పాలయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సత్యవతి రాథోడ్ 2013లో టీఆర్ఎస్‌లో చేరి 2014లో ఆ పార్టీ అభ్యర్థిగా రెడ్యానాయక్‌పై పోటీచేశారు. ఆ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రెడ్యానాయక్ జయకేతనం ఎగురవేసి తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా రెడ్యానాయక్ పోటీ చేసి గెలుపొందగా... టిక్కెట్ ఆశించి భంగపడ్డ సత్యవతి రాథోడ్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా కేసీఆర్ అవకాశం కల్పించారు. ఆ తర్వాత కొద్ది నెలలకే తొలి గిరిజన మహిళా మంత్రిగా క్యాబినెట్‌లో చోటు కల్పించారు. అదే సమయంలో సీనియర్ ఎమ్మెల్యే అయిన రెడ్యానాయక్‌ను షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీకి ఛైర్మన్‌గా నియమించారు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలకు కేసీఆర్ సముచిత స్థానం కల్పించినా, తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎవరికివారు తామేమీ తక్కువ కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో ఆధిపత్యం చాటుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొద్ది నెలల్లో ఎన్నికలు జరగనుండడంతో... ఇప్పటినుంచే భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రెడ్యానాయక్ పనిచేయగా.... ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వంలో సత్యవతి రాథోడ్ అదే శాఖతో పాటు స్త్రీ శిశు సంక్షేమం దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న రెడ్యానాయక్ సందర్భోచితంగా మంత్రి సత్యవతి రాథోడ్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తుండడం కలకలం రేపుతోంది. పైగా తనను మంత్రి ఎందుకు ఇగ్నోర్ చేస్తున్నారో తెలియడం లేదంటూ ఇరుకున పెట్టె ప్రయత్నాలు చేస్తున్నారు మంత్రిగా ఉన్న సత్యవతి రాథోడ్ వచ్చే ఎన్నికల్లో డోర్నకల్ నుంచి టికెట్ ఆశిస్తుండడంతో వీరిమధ్య గ్యాప్ మరింత పెరిగింది. మూడుసార్లు డోర్నకల్ నుంచి పోటీచేసి ఒక్కసారే గెలిచిన సత్యవతి రాథోడ్ నాలుగోసారి మంత్రి హోదాలో అక్కడి నుంచే తన అదృష్టాన్ని పరిక్షించుకోవాలనుకుంటున్నారు. దాంతో డోర్నకల్ రాజకీయం రసవత్తరంగా మారింది. సత్యవతి రాథోడ్ ప్రయత్నాలను గమనించిన రెడ్యానాయక్ ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు.డోర్నకల్ నియోజకవర్గం మీద మంత్రి సత్యవతి రాథోడ్, ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్యా నాయక్ చేస్తున్న కామెంట్స్ బీఆర్ఎస్ లో కలకలం రేపుతున్నాయి. ఇద్దరు నేతలు డోర్నకల్ లో సీటు కోసం వేస్తున్న ఎత్తులతో డోర్నకల్ రాజకీయాల్లో హిట్ పెరుగుతోంది. అధిష్టానం ఆదేశాలు జారీ చేస్తే డోర్నకల్ నుంచి పోటీ చేయడానికి సిద్ధమంటూ మంత్రి సత్యవతి నిన్న హైదరాబాదులో ప్రకటించడం రచ్చకు దారి తీసింది. డోర్నకల్ సీటు కోసం గుంట నక్కలు కాసుకొని కూర్చున్నాయంటూ రెండు రోజుల క్రితం రెడ్యా నాయక్ ఆత్మీయ సమావేశంలో చెప్పారు. ఆ గుంట నక్కలు ఎవరా అని చర్చ జరుగుతుండగానే.. మంత్రి సత్యవతి రాథోడ్ డోర్నకల్ లో పోటీ చేయడానికి సిద్ధమని ప్రకటించడం హాట్ టాపిక్ గా మారింది.రెడ్యా నాయక్ ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆవేదనతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఇంటి దొంగలతో జాగ్రత్తగా ఉండాలి, కొందరైతే నా చావు కోసం ఎదురు చూస్తున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్‌డీఎస్ రెడ్యానాయక్ చేసిన కామెంట్స్ ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు తెర తీశాయి. నన్ను ఓడించాలని కుట్రలు చేశారు. మళ్ళీ చేస్తారు. గుంట నక్కలు, రాబందులు పొంచుకొని ఉంటాయి.. అయినా మీ అభిమానంతో బీఆర్ఎస్ గెలుస్తుందంటూ డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ వ్యాఖ్యలు చేశారు. సీరోలులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో రెండు గుంటనక్కలు పొంచుకొని ఉన్నాయి. వాటికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం నేర్పుదామంటూ డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే రెడ్యానాయక్ కుమారుడు డీఎస్ రవిచంద్ర సంచలన విమర్శలు చేశారు. ఈ సమావేశంలో ఆయన ఉద్వేగంతో ప్రసంగించారు. తమ మనోభావాలు బహిర్గతం చేశారు. అయితే ఈ వ్యాఖ్యలతో ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు పరోక్షంగా విమర్శలు చేస్తున్నారని టాక్ నడుస్తోంది. ఇప్పటికే డోర్నకల్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ శ్రేణులు రెండు వర్గాలుగా చీలిపోగా ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే, మొదటికే మోసం వస్తుందని రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది.ఇద్దరు నేతల తీరుతో డోర్నకల్ లో బీఆర్ఎస్ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రులు, కేటీఆర్, హరీష్ రావు కలగజేసుకుకుంటారా.. లేక సీఎం కేసీఆర్ ఇద్దరికి సర్ది చెప్తారా... లేక మంత్రి సత్యవతి రాథోడ్ కు టికెట్ కన్ఫామ్ చేస్తారా అనే చర్చ జరుగుతోంది. ఇక అధినేత కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారు అని స్థానికంగా ఉత్కంఠ నెలకొంది.

# అమ్మకానికి హెచ్ఎండీఏ ప్లాట్లు

**హైదరాబాద్ :**

హైదరాబాద్ లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ప్లాట్లను మరోసారి వేలం వేసేందుకు సిద్ధం అయింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రభుత్వ స్థలాల్లో అభివృద్ధి చేసిన మరికొన్ని ప్లాట్లను విక్రయానికి పెట్టింది. హైదరాబాద్ శివార్లలోని బాచుపల్లిలో 133 ప్లాట్లు, మేడిపల్లిలో 85 ఫ్లాట్లకు వచ్చే నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు. నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని బాచుపల్లిలో 27 ఎకరాలు, మేడిపల్లిలో 55 ఎకరాల ప్రభుత్వ స్థలంలో హెచ్ఎండీఏ భారీ లే అవుట్లను అభివృద్ధి చేసింది. మార్చిలో మొదటి విడత కింద కొన్ని ప్లాట్లను విక్రయించగా కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది . దీంతో తాజాగా రెండో విడత కింద రెండు లే అవుట్లలోని ప్లాట్లను విక్రయించేం దుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ను జారీ చేసింది. బాచుపల్లిలో చదరపు గజానికి రూ.25 వేలు, మేడిపల్లిలో రూ.32 చొప్పున ఉండాలని నోటిఫికేషన్ లో సూచించింది. మరింత సమాచారం కోసం హెచ్ఎండీఏ వెబ్ సైట్, ఎంఎస్ టీసీ ఈ కామర్స్, ఎంఎస్టీసీ ఇండియా వెబ్ సైట్లను సంప్రదించాలని తెలిపింది. లేఅవుట్ ల సందర్శనకు, సందేహాల నివృత్తి కోసం 7396345623, 915484321 నంబర్లకు సంప్రదించాలని అధికారులు తెలిపారు. తొర్రూర్, బహదూర్ పల్లిలో అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లను హెచ్ఎండీఏ వేలం వేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని లే అవుట్లలోని 324 ప్లాట్లకు వేలం వేసింది. బహదూర్ పల్లిలో 101 ప్లాట్లు, తొర్రూర్ లో 223 ప్లాట్లు అమ్మకానికి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మార్చి మూడో వారంలో ఈ-వేలం ద్వారా ప్లాట్లను విక్రయించా. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు మేడ్చల్ జిల్లాలోని బహదూర్ పల్లి, రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్ లోని ప్లాట్లను ఎంఎస్టీసీ ఆధ్వర్యంలో వేలం ద్వారా విక్రయించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ అన్ని ఏర్పాట్లు చేయగా.. మార్చి 14, 15 తేదీల్లో బహదూర్‌పల్లిలోని 101 ప్లాట్లు, తొర్రూర్‌లోని 223 ప్లాట్లను వచ్చే నెల 14 నుంచి 17 వరకు ఈ-వేలం వేస్తామని అధికారులు ప్రకటించారు. ఇప్పటికే కోకాపేట్, ఖానామెట్, ఉప్పల్ భగాయత్ భూములను హెచ్ఎండీఏ విజయవంతంగా విక్రయించింది. ఇప్పుడు జరగబోయే ఈ వేలాల ద్వారా కూడా భారీగానే డబ్బులు సమకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరి చూడాలి హెచ్ఎండీఏకు ఏ మేర నిధులు వస్తాయో. బహదూర్‌పల్లిలో గజానికి రూ.25 వేలు, తొర్రూర్‌లో గజానికి రూ.20 వేలు కనీస ధరను హెచ్ఎండీఏ నిర్ణయించింది. బహదూర్ పల్లిలో 600 గజాల వరకు ఒక్కో ప్లాటుకు రూ.3 లక్షలు, 600 గజాలు దాటితే రూ.5 లక్షలు, తొర్రూరులో ఒక్కో ప్లాట్‌కు రూ.లక్ష చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కోకాపేట, ఉప్పల్ భగాయత్ వెంచర్లలో ప్లాట్లను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఈ భూములకు రూ.వేల కోట్లు పలికాయి. తాజాగా మరో రెండు వెంచర్లలో ప్లాట్ల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వెంచర్ల ప్లాట్ల విక్రయం ద్వారా కూడా కోట్లాది రూపాయలు సమకూర్చుకునే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# రోడ్డుపైనే జెసి ప్రభాకర్ రెడ్డి నిద్ర, స్నానం

**తాడిపత్రి**

మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి నిరసన కార్యక్రమం కోనసాగిస్తున్నారు. అంతే కాకుండారాత్రి రోడ్డు డివైడర్పై నిద్రించి, ఉదయం మున్సిపల్‌కార్యాలయం ఆవరణంలో స్నానం చేశారు. న్యాయం జరిగే వరకూ తగ్గేదేలా అని జెసి ప్రభాకర్ రెడ్డి నిరసన తెలియజేస్తున్నారు. తాడిపత్రిలో నిన్న ఉదయం నుంచి హైటెన్షన్ కొనసాగింది. పెన్నా నదిలో ఇసుక అక్రమ రవాణాతో పాటు, తాడిపత్రిలో మున్సిపల్ కమిషనర్ విధుల నిర్లక్ష్యంపై మున్సిపల్ ఆఫీస్ ఎదుట వంటావార్పునకు జేసీ పిలుపు నిచ్చారు. దీంతో జేసీ ఇంటిదగ్గరకు టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. నిరసన కార్యక్రమానికి అనుమతి లేదన్న పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా జేసీ ప్రభాకర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. 100 మంది టీడీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. పోలీసుల చర్యలను ఖండిస్తూ తన ఇంటి ముందే కుర్చీలో కూర్చొని జేసీ నిరసన తెలిపారు. కుర్చీతో సహా జేసీని బలవంతంగా తిరిగి లోపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు యత్నించారు. దీంతో తాడిపత్రిలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.అయితే, తాడిపత్రి పట్టణంలో రాత్రి హైడ్రామా కొనసాగింది. కౌన్సిలర్లను అరెస్ట్ చేయడంపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన నిర్వహించారు. అర్ధరాత్రి వరకు రోడ్డుపైనున్న డివైడర్లపై పడుకుని నిరసన వ్యక్తంచేశారు. సాయంత్రం కౌన్సిలర్లను పోలీసులు అరెస్ట్ చేయడంతో జేసీ ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంట్లోకి తీసుకెళ్లారు. అయినప్పటికీ.. జేసీ నిరసనను కొనసాగిస్తున్నారు.అనంతరం ఉదయాన్ని జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి మున్సిపల్ ఆఫీసుకు వచ్చారు. ఆఫీసు ఆవరణలోనే బ్రష్ చేసి, స్నానం చేశారు. దీంతో మున్సిపల్ ఆఫీసుకు వస్తానన్న పంతాన్ని జేసీ నెగ్గించుకున్నారు. నిన్నటి నుంచి కొనసాగుతున్న హైడ్రామా రాత్రి డివైడర్లపై పడుకుని నిరసన తెలిపే వరకు వెళ్లింది.

## దేవస్థానం ఈవో, అర్చకుల మధ్య వార్

**నంద్యాల**
మహానంది దేవస్థానంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మరియు అర్చకుల మధ్య సోమవారం వివాదం చోటుచేసుకుంది. ఎన్నడూ లేని విధంగా వివాదం తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. ఆలయ అధికారి, అర్చకుని పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆలయంలో పూజారులు ధర్నాకు దిగారు. ×నిత్యం మహానంది ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులనుద్దేశించి, ఆలయ అధికారి కాపు చంద్ర శేఖర్ రెడ్డి నా కొడుకుల్లారా!!అంటూ అసభ్య పదజాలంతో దూషించడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అర్చకులను అసభ్య పదజాలంతో మాట్లాడిన ఈఓను వెంటనే ప్రభుత్వం సస్పెండ్ చేయాలంటూ ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మంగళవారం కుడా ఇదే అంశంపై ఈవోకు అర్చకులకు మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది.

## షర్మిలకు బెయిల్ మంజూరు

**హైదరాబాద్**
పోలీసులపై దాడి కేసులో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లోటస్పాండ్ దగ్గర సోమవారం పోలీసులపై దాడి కేసులో వైఎస్ షర్మిలకు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆమెను పోలీసులు చంచల్ గూడా జైలుకు తరలించారు. దీనిపై షర్మిల బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ చేపట్టిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## విద్యుత్ ఆర్టిజన్ల అరెస్టు

**రంగారెడ్డి**
విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు వెళ్తున్న వారిని జీడిమెట్ల పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఆర్టిజన్, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ నేడు సమ్మెకు పిలుపునివ్వడంతో చర్యలు మొదలయ్యాయి. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టిజన్లు డిమాండ్ చేస్తున్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మద్దతు పలికారు.

## వలలో గోల్డ్ ఫిష్



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడకల్ గ్రామంలోని పెద్ద చెరువులో వారం రోజుల నుంచి చేపల వేట కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ మాదిరిగానే మత్స్యకారులు వల వేయగా.. బంగారం వర్ణం చేప చిక్కింది. ఇది చూసి మత్స్యకారులు ఆశ్చర్యపోయారు. వెంటనే ఒడ్డుకు తీసుకురాగా.. అందరూ దాన్ని చూస్తూ సంబరపడ్డారు.
చేప బరువు సుమారు ఐదు కిలోలపైనే ఉందని తడకల్ మత్స్యకారులు వెల్లడించారు. ఇలాంటి చేప దొరకడం ఇదే మొదటిసారని వివరించారు. కాగా.. బంగారు వర్ణంతో ఉన్న చేప దొరికిందన్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు, చుట్టుపక్కల వారు చేపను చూసేందుకు భారీగా తరలివచ్చారు. అయితే, ఆ చేపను హైదరాబాద్ లోని ముషిరాబాద్ మార్కెట్ కు తరలించినట్లు మత్స్యకారులు తెలిపారు.

## యాదాద్రి లో మే నెల 2 నుంచి 4 తేదీ వరకు జయంతి ఉత్సవాలు

**యాదాద్రి**
యాదాద్రి లో మే నెల 2 నుంచి 4 తేదీ వరకు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఇఓ గీతా రెడ్డి మీడియాతో మాట్లాడారు. 2 వ తేదీన ఉదయం స్వస్తి వాచనము, విష్వక్సేన పూజ, పూణ్యాహవాచనము, ఋత్విక్ వరణం, తిరు వెంకటపతి అలంకారం శేవ, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. ఆదే రోజు సాయంత్రం 6 గంటలకుమృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం, గరుడవాహన పరవాసుదేవ అలంకార సేవ జరుపుతారు.3 వ తేదీ ఉదయం.. నిత్యమూలమంత్ర హనములు, ఉదయం గం.9.00లకు కాళీయ మర్దన అలంకార సేవ 'గం.10.30 ని॥లకు లక్ష పుష్పార్చన, సాయంత్రం..నృసింహ మూలమంత్ర హవనములు వుంటుంది. హనుమద్వాహన్, హనుమంత వాహనంపై శ్రీ రామావతారం ఆలంకార సేవ, 4 వ తేదీన ఉదయం గం.7.00ల నుండి నృసింహ మూలమన్త హవనములు, .9.00ల నుండి గం.9.30ని॥ల వరకు. మహాపూర్ణాహుతి తదుపరి సహస్రకలశాభిషేకము, సాయంత్రం..గం.7.00ల నుండి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠి, ఉత్సవ సమాప్తి జరుగుతాయి.మే 2 తేదీ కు నుండి 4వ తేదీ వరకు సుదర్శన నరసింహం, నిత్య శాశ్వత కళ్యాణం, నిత్య బ్రహ్మోత్సవాలు రద్దు చేస్తామని ఆలయ ఈవో వెల్లడించారు.

## 15 రోజుల్లో 79 లక్షల మిస్డ్ కాల్స్

**కాకినాడ**
జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభించిన 15రోజుల్లోనే 79లక్షల మిస్డ్ కాల్స్ రావడం రికార్డ్ అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్లో గల తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడారు. ప్రజా సర్వేలో మాకు వస్తున్న అపూర్వమైన స్పందన చూసి ప్రతిపక్షాలు ఉలిక్కిపడుతున్నాయన్నారు.

# ఆకాల వర్షంతో పులుపెక్కిన మామిడి

**వరంగల్ :**

మధుర ఫలం పులుపెక్కింది. ఇటు పచ్చడి నిల్వ చేసుకోవాలనుకునే వారికి.. అటు పండ్ల రుచిని ఆస్వాదించాలనుకున్న వారికి నిరాశే మిగులుతోంది. కొత్తపేట పండ్ల మార్కెట్‌కు గతంలో రోజుకు 1000 టన్నుల మామిడి రాగా, ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌కు 600 టన్నులకు మించి రావడం లేదు. టన్ను ధర (కాయ సైజును బట్టి) రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు పలుకుతోంది నాలుగు రోజుల క్రితం రికార్డుస్థాయిలో రూ.1.24 లక్షలు పలకడం విశేషం. డిమాండ్ మేర దిగుమతి లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో ధరలు అమాంతం పెరిగి పోయాయి. పండ్లరసాలు కిలో రూ.150-200 వరకు విక్రయిస్తుండగా, పచ్చడి కాయలు సైజును బట్టి ఒక్కోటి రూ.15?20 చొప్పున అమ్ముతుండటం గమనార్హం. బాటసింగారం మార్కెట్ నుంచి మామిడి సహా ఇతర పండ్లు సరఫరా అవుతుంటాయి. రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం సహా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర శివారు జిల్లాలకు చెందిన రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడికే తెచ్చి అమ్ముతుంటారు. ప్రస్తుత సీజన్‌లో ఆయా జిల్లాల నుంచి రోజుకు సగటున వెయ్యి టన్నులకుపైగా మామిడి రావాల్సి ఉండగా, 500 టన్నుల లోపే వస్తోంది. పచ్చడిలో ఉపయోగించే పుల్లటి మామిడి కాయలే కాదు బంగినపల్లి, తోతాపురి, చెరుకురసం, సువర్ణ రేఖ, నీలం రకాల మామిడి పండ్లు కూడా రావడం లేదు. సాధారణంగా మార్చి చివరి నాటికి మార్కెట్లను ముంచెత్తాల్సిన ఫలరాజం ఏప్రిల్ రెండో వారంలోనూ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వాతావరణ మార్పులతో మామిడి పూత, కాత తగ్గి దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపినట్లు తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధ్యయనంలో తేలింది. చలికాలంలో భారీ వర్షాలు కురవడం.. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోవడం.. ఫిబ్రవరి నుంచి ఎండలు మండిపోవడం.. మార్చిలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పూత ఎండి పిందె రాలిపోయింది. గతంలో ఒక నిమ్మ చెట్టుకు ఐదు నుంచి ఆరు బస్తాల కాయలు వచ్చేవి.చీడపీడల కారణంగా ఈసారి ఒకటి రెండు బస్తాలకే పరిమితమైంది. వ్యవసాయ మార్కెట్లో బస్తా రూ.2,500 పైగా, సైజును బట్టి రిటైల్‌గా ఒక్కో కాయ రూ.10 పలుకుతోంది. ప్రస్తుతం పచ్చళ్ల సీజన్ మొదలైంది. సాధారణంగా ఈ సీజన్‌లో ప్రతి ఇంట్లో మామిడి, నిమ్మ పచ్చళ్లను తయారు చేసుకుని ఏడాదంతా నిల్వ చేసుకుంటారు. మామిడి, నిమ్మ కాయల ధరలకు తోడు వంటనూనెలు, మసాల దినుసులు, కారం పొడులు కూడా భారీగా పెరగడంతో పచ్చడి మొతుకుల కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం తప్పడం లేదు.

# భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో నేతల వార్

**హైదరాబాద్ :**

వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వరుసగా వార్తల్లో నిలుస్తున్నారు. అలాగని అదేదో? జనానికి మంచి చేసికాదు. వాళ్ళని ఇబ్బంది పెడుతూ తానేదో హీరో అనిపించు కోవాలనుకుంటున్నారట ఆయన. ఇటీవల ఎమ్మెల్యే చేస్తున్న పనులు గ్రామాల్లో అసహనాన్ని పెంచుతున్నాయట. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయ విరోధం ఉంది. దానికి తోడు స్థానిక భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో నేతల మధ్య గొడవ జరిగింది. హారతి సమయంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిని చేతితో నెట్టి వేసే ప్రయత్నం చేశారట. దాంతో ఇద్దరూ కాసేపు రోడ్‌సైడ్ తోపులాట స్థాయిలో తలపడ్డారట.కొంత కాలంగా పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి. అందులో భాగంగా బషీరాబాద్ మండలం మైలవరంలో రోహిత్ రెడ్డి వ్యవహార శైలి గ్రామస్థులకు ఆగ్రహం తెప్పించిందట. స్థానిక అక్కలమ్మ చెరువు తూము పనులు నిలిచిపోవడంతో సాగు చేయడం లేదని? సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని ఎమ్మెల్యేని ప్రశ్నించారట గ్రామస్తులు. అయితే పరిష్కారంచెప్పకుండా, ప్రశ్నించిన వారిని స్టేజి దిగిపోవాలని వార్నింగ్ ఇవ్వడం, పోలీసులను పురమాయించి మరీ కిందికి దింపడంపై కోపంతో ఉన్నారట గ్రామస్తులు. నిరుడు కూడా ఇలాంటి ఘటనే జరిగింది.ఇదే మండలంలోని క్యాద్గిర సర్పంచ్ ను ప్రజల మధ్యలోనే ఎమ్మెల్యే బెదిరించారు. అభివృద్ధికి అడ్డుపడితే చూస్తూ ఊరుకోను అంటూ చిందులు వేశారు. పీడీ యాక్ట్ పెట్టిస్తానంటూ బెదిరించారట ఎమ్మెల్యే. అటు తాండూరు బీఆర్ఎస్‌లో రోజు రోజుకు ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మధ్య వర్గ పోరు పెరుగుతోంది. నువ్వెంత అంటే నువ్వెంత అని వేదికల మీదే కొట్లాడుకుంటున్న ఘటనలు ఉన్నాయి. బయటికి రా చూసుకుందాం అంటూ ఒకరికొకరు సవాళ్ళు విసురుకుంటున్నారు. గొట్టి గఖుర్దులో పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి? సమావేశంలో ఎమ్మెల్సీ వర్గానికి చెందిన గ్రామ ఉప సర్పంచ్‌కు స్టేజీ మీద కుర్చీ ఇవ్వలేదని సర్పంచే ఆగ్రహం వ్యక్తం చేశారట. బహిరంగంగా ఎమ్మెల్యే ముందే స్థానిక నాయకులు తిట్టుకుంటూ బయటికి వచ్చేశారట. దీంతో కార్యక్రమం ప్రారంభించకుండానే ఎమ్మెల్యే వెళ్ళిపోయారట. రోహిత్‌రెడ్డి చేసిన పనికి స్థానిక నాయకులు కొట్టుకుని చొక్కాలు చించుకున్నారట. కక్షపూరితంగానే ఎమ్మెల్యే వర్గీయులు ఎమ్మెల్సీ మనుషులను అవమానిస్తున్నారని , ప్రోటోకాల్ పాటించడం లేదని అసహనంగా ఉన్నారట మహేందర్‌రెడ్డి వర్గీయులు.నియోజకవర్గంలో జరుగుతున్న వరుస సంఘటనలు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రచారం కోసం చేయిస్తున్నారా? లేక కాకతాళీయంగా జరుగుతున్నవా అన్నది అర్థం కావడం లేదని వాపోతున్నారట స్థానిక బీఆర్ఎస్ నాయకులు. ఇది పార్టీకి నష్టం చేస్తుందని టెన్షన్ పడుతున్నారట. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మీద పైచేయి సాధించాలంటే వేరే మార్గాలున్నాయని, ఇలా గ్రామ స్థాయిలో సిల్లీగా గొడవలు పెట్టుకుంటే నష్టమే తప్ప ఏం ఉపయోగం అంటున్నారట పార్టీ నేతలు.

# ఖతర్ వెళ్లాల్సిన విమానంలో హఠాత్తుగా తలెత్తిన సాంకేతికలోపం

**రన్ వే పై కదులుతూ కొంత దూరం వెళ్లి హఠాత్తుగా ఆగిపోయిన విమానం**

**అప్రమత్తమైన విమాన సిబ్బంది.. 324 మంది ప్రయాణికులు సురక్షితం**




**చెన్నై**

చెన్నై నుంచి ఖతర్ వెళ్లాల్సిన విమానంలో హఠాత్తుగా తలెత్తిన సాంకేతికలోపాన్ని వెంటనే గుర్తించినందువల్ల 336 మంది ప్రయాణికులు ప్రాణా పాయం నుంచి తప్పించుకున్నారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఖతర్ దేశ రాజధాని దోహా వెళ్లాల్సిన ఖతర్ ఎయిర్ లైన్స్ ప్రయాణికుల విమానం సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరేందుకు సిద్ధంగా ఉంది. ఈ విమానంలో 324 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. ఆ విమానం రన్ వే పై కదులుతూ కొంత దూరం వెళ్లి హఠాత్తుగా ఆగిపోయింది. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది విమానం ఇంజన్‌లో లోపం ఉన్నట్లు గుర్తించా రు. ఈ ఘటనపై విమానాశ్రయ కంట్రోల్ రూంకు సమాచారం అందజేశారు. అనంతరం ఆగిపోయిన విమానాన్ని రికవరీ వాహనం ద్వారా బయల్దేరి న స్థలానికే తీసుకెళ్లి నిలిపారు. విమానం టేకాఫ్?కు ముందే సాంకేతిక లోపాన్ని గుర్తించిన కారణంగా 336 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని, ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

# రోజుకు 12 గంటలా లేక 8 గంటలా అనేది కార్మికులు నిర్ణయించుకోవాలి

## తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ డాక్టర్ తమిళిసై

**చెన్నై**

కార్మికుల పని సమయాన్ని 12గంటలకు పెంచు తూ డీఎంకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనూహ్య మద్దతు లభించింది. డీఎంకే మిత్రపక్షాలు సైతం ఈ నిర్ణయాన్ని తప్పు బడుతుండగా, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ డాక్టర్ తమిళిసైమాత్రం స్టాలిన్ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించడం విశేషం. సోమవారం మదురై మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్న తమిళిసై మీడియతో మాట్లాడుతూ.. రోజుకు 12 గంటలా?, లేక 8 గంటలు పనిచేయాలా అనే విషయాన్ని కార్మికుడు నిర్ణయించు కోవాలన్నారు. ఈ చట్టంపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికుల వద్ద అధ్యయనం చేశారన్నారు. ఇందులో అధిక సమయం పని చేసి, అధిక సమయం విశ్రాంతినివ్వడం వల్ల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని తేలిందన్నారు. ఇక్కడ పని గంటలు మాత్రమే పెంచారని, కార్మికుడిపై అధిక భారాన్ని మోపలేదన్నారు. ఈ చట్టాన్ని ఇప్పటికే కర్ణాటక, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఈ చట్టాన్ని రాజకీయం చేయరాదని సూచించారు. తాను ఒక గవర్నర్‌గా ఉన్నందున, రాజకీయాల్లోకి



లాగవద్దని విజ్ఞప్తి చేశారు. అన్నాడీఎంకే - బీజేపీ కూటమి గురించి తనకేమీ తెలియదన్నారు. తాను రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో ఇతర రాజకీయ పార్టీల నేతల వద్ద తనకు మంచిపేరు, గౌరవం ఉండేదని తమిళిసై గుర్తు చేసుకున్నారు.

## మంచిపని ఒక్కటైనా చేశావా జగన్?!

**మంత్రాలయం**



టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర మంత్రాలయంలో మంగళవారం కొనసాగింది. లోకేష్ మాట్లాడుతూ కరువుసీమలో సాగు, తాగునీరు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడిన కష్టం అడుగడుగునా సాక్షాత్కరిస్తోంది. మంత్రాలయం నియోజకవర్గం గవిగట్టు శివార్లలో పులికనుమ బ్రాంచి కెనాల్ ఎడారిలో ఒయాసిస్సులా నీళ్లతో కళకళలాడుతూ కన్పించింది. తుంగభద్ర ఎల్ఎల్ సి కెనాల్ కు నీరు నిలిపివేసినపుడు ప్రత్యామ్నాయ సాగునీటి వనరుగా కోసిగి మండలం పులికనుమ వద్ద రూ. 261కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని గత టిడిపి ప్రభుత్వ హయాంలో పూర్తిచేశారు. దీనిద్వారా 64 గ్రామాలకు తాగునీరు, 26వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాయలసీమ ప్రజల కళ్లలో ఆనందం చూసేలా ఒక్క పనైనా చేశావా జగన్మోహన్ రెడ్డీ అని నిలదీసారు.

## ఈ వేసవిలో తాళి కట్టు శుభవేళలు ఇవే

**హైదరాబాద్**
తెలుగు రాష్ట్రాల్లో వచ్చే రెండు నెలల్లో పెళ్లి సందడి ప్రారంభం కానుంది. మే, జూన్ నెలల్లో పెళ్లిళ్లకు అనువైన తేదీలను పండితులు ప్రకటించారు.మే నెలలో 6, 8, 9, 10, 11, 15, 16, 20, 29, 30 తేదీలలో. జూన్ నెలలో 1, 3, 5, 6, 7, 11, 12, 23, 24, 26, 27లలో మంచి మహూర్తాలు ఉన్నట్లు వారు వెల్లడించారు

## నా మనసును కదిలించింది

**శ్రీకాకుళం**
శ్రీకాకుళం జిల్లాలో జరిగిన స్ఫూర్తిదాయక ఘటనపై ఎంపి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఈ ఘటన పై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ ఇది తన మనసును కదిలించిందని తెలిపారు.. కిరణ్ చంద్ అనే 15 సంవత్సరాల యువకుడు చనిపోయిన తరువాత వారి అమ్మ నాన్న గిరిజ, మోహన్ లు అవయవ దానం చేద్దామని తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందించినదగినదని ఎంపి తెలిపారు. వారి నిర్ణయం ఐదుగురిని బతికించడమే కాకుండా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు.

## రాయల తెలంగాణ అవసరం లేదు

**హైదరాబాద్**
రాయల తెలంగాణ రాష్ట్రం కావాలంటూ ఆంధ్రప్రదేశ్ నేత, మాజి మంత్రి జేసి.దివాకర్ రెడ్డి చేసిన కామేంట్లకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనదైన శైలిలో స్పందించారు. మంగళవారం నాడు ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రతినిధుల సభ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గోన్న దానం మాట్లాడుతూ మూడవ సారి రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి రాయల తెలంగాణ డిమాండ్ ను కోరుతున్నారు. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పట్ల సానుకూలత వుంది. రాయలసీమ అభివృద్ధి జరగాలంటే ఏపీలో బిఆర్ఎస్ ను గెలిపించాలి. ఏపీలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. రాయల తెలంగాణ అవసరం లేదు. ఏపీలో బిఆర్ఎస్ కు పట్టం కట్టండని దానం అన్నారు.

## ఎస్పీకి ఫిర్యాదు చేసిన మేయర్

**నెల్లూరు**
తనపై నీచాతినీఛంగా దాడికి ప్రయత్నించిన కార్పొరేటర్లపై నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు నెల్లూరు నగర మేయర్ స్రవంతి. జిల్లా ఎస్పీ ఆఫీస్ కి గిరిజన సంఘాల నాయకుల తో కలసి వచ్చారామె. ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డిని కలిశారు. అప్పటికే ఆమె మొయిళ్ల గౌరి, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, విజయ భాస్కర్ రెడ్డిపై నెల్లూరు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఎస్పీని కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించారని ఆమె మీడియా కు తెలిపారు.తనను అవమానించిన కార్పొరేటర్లు తిరిగి తనతో ఉన్న కార్పొ రేటర్ల భర్తలపై కేసులు పెట్టారని, వాటి విషయంలో కూడా తగిన చర్యలు తీసుకోవాలని, ఫాల్స్ కేసుల్ని కొట్టేయా లని జిల్లా ఎస్పీని కోరారు మేయర్ స్రవంతి. తనపై దాడి చేసి తిరిగి తమవారిపైనే కేసులు పెట్టడం సరికా దని చెప్పారు. ఈ ఘటనపై తాను ఎంతదూరమైనా వెళ్తానని, అవసరమై తే సుప్రీంకోర్టుకి వెళ్తానన్నారు.

## మహిళల ముష్టియుద్ధం

**బెంగళూరు**
కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో మల్లేశ్వరం ప్రాంతంలో ఉండే మైసూరు సిల్క్ శారీ సెంటర్ ఇటీవల డిస్కౌంట్ ధరలతో ఇయర్లీ శారీ సేల్ నిర్వహించింది. బయట మార్కెట్ కంటే తక్కువ ధర ఉండటం, చీరలు కూడా బాగుండటం తో వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు ఆ దుకాణానికి క్యూ కట్టారు. అందులో ఇద్దరు మహిళలకు ఒకే చీర నచ్చింది. అంతే, ఇంకేముం ది.. ఆ చీర నాకు కావాలని ఒకరంటే.. కాదు నాకు కావాలి అని మరో మహిళ గొడవకు దిగారు. అది కాస్తా ముదిరి ఒకరి జుట్టు ఒకరు పట్టుకుని కొట్టుకు నేవరకు వెళ్లారు.

ప్రజా తపన
prajathapana.com

# దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్న మోడీని గద్దె దించుదాం

**ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం**

**దేశాన్ని కాపాడుకుందాం- సిపిఐ**

**బద్వేలు**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో పూర్తిగా విఫలమయ్యాయని ప్రజలు వచ్చే ఎన్నికల్లో మోడీ జగన్ లకు తగిన బుద్ధి చెబుతారని సిపిఐ బద్వేలు ఏరియా కార్యదర్శి కె జకరయ్య పేర్కొన్నారు సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా మంగళవారం బద్వేలు మండల సమితి ఆధ్వర్యంలో రూరల్ ప్రాంతం లోని నక్కల గండి విజయరామపురం కొట్టాలు తిమ్మరాజు పల్లె గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ"ప్రచార బేరి"కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి జకరయ్య గారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను మోసం చేశారన్నారు విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి పేదల అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తానని హామీ ఇచ్చారని మరి ఆ హామీ ఏమైందని వారు ప్రశ్నించారు మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం దారుణం అన్నారు పోలవరం నిధులు రైల్వే జోన్ రాజధాని నిర్మాణం ప్రత్యేక హోదా రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలు వీటిలో ఏ ఒక్క దానిని అమలు చేయకుండా పైగా రాష్ట్రానికి ఆయువు పట్టులాంటి విశాఖ ఉక్కును ఆదానికో అంబానీకో కట్ట పెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దాసోహం అంటున్నదని వారు మండిపడ్డారు సిపిఐ జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ బద్వేల్ రూరల్ కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతి వ్యక్తి గుంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయం ఆసన్నమైందని లేదంటే మనందరి భవిష్యత్తు చీకటిమయం అయిపోతుందని నాడు అనేక మంది త్యాగధనులు బ్రిటిష్ వలస పాలనను ఎదిరించి తరిమికొట్టి మనకు స్వాతంత్రం తెచ్చారు నేడు అదే స్వాతంత్రం పెను ప్రమాదంలో పడింది దానిని కాపాడుకోవాల్సిన మనం ఆనాటి జాతీయ ఉద్యమ స్ఫూర్తితో మళ్ళీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని మనం కట్టిన పనులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని ఓడరేవుల్ని ఆఖరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు దారాదుత్వం చేస్తుంది మోడీ ప్రభుత్వం మోడీ అండదండలతో ఆదాని ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిండెన్ బర్గ్ నివేదిక బట్టబయలు చేసింది అయినా దానిమీద విచారణకు అంగీకరించకుండా ఆదానిని ఈ కేంద్ర ప్రభుత్వం వెనకేసుకు వస్తుంది పైగా మరింత వేగంగా దేశంలోని అడవులను భూములను విద్యుత్తు ప్రాజెక్టులను గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతుంది పేదలకు సామాన్య ప్రజలకు అండగా ఉండడం పోయి వారి మీదే మోయలేనంత భారాలను మోపుతున్నది మోడీ ప్రభుత్వం గ్యాస్ బండ మనకు గుదిబండ అయిపోయింది కరెంట్ బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొడుతున్నాయి పెరిగిపోతున్న పెట్రోల్ డీజిల్ ధరలు మన బతుకుల్లోమంటలు రాజేస్తున్నాయి ధరలు కొండక్కాయ్ నిరుద్యోగుల బతుకులు అగాధంలోకి జారిపోతున్నాయి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదు పేదలకు విద్యా వైద్యం అందనంత ఖరీదైపోయి కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయింది గ్రామీణ పేదలకు ప్రాణదారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని సైతం మోడీ ప్రభుత్వం ఆటకెక్కించింది మహిళలకు రక్షణ లేకపోగా దాడులు అత్యాచారాలు పెద్ద ఎత్తున పెరిగాయి దళిత గిరిజన ప్రజల సంక్షేమానికి సామాజిక న్యాయానికి దూరమైపోతున్నారు కులవిద్వేషం పెత్తందారీతనం మనువాద శక్తుల అండతో పెట్రేగిపోతున్నాయని వారన్నారు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో దళితులపై దళిత అధికారులపై దాడులు హత్యలు ఎక్కువయ్యాయని మొన్న డాక్టర్ సుధాకర్ నిన్న అచ్చన్న ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయన్నారు రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి బిజెపి ప్రభుత్వం తన అంటే తందానా అంటూ ప్రజలపై పన్నుల భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజాసంఘాలను మేధావులను కవులను కళాకారులను కలుపుకొని పల్లె పల్లె ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్య పరుస్తూ వచ్చే ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్ద దింపడమే ధ్యేయంగా పనిచేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏరియా కౌన్సిల్ సభ్యులు రేనాటి శ్రీనివాసులు తప్పేట సుబ్రహ్మణ్యం పాండు బద్వేల్ రూరల్ నాయకులు ఓబయ్య రమేష్ కళ్యాణ్ శ్రీను గురయ్య ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# యువకుడి దారుణ హత్య

**ప్రేమ పేరుతో వేధింపులే కారణం**

**మాటేసి మట్టు పెట్టిన వైనం**

**దారుణంగా చంపారంటూ హతుని కుటుంబీకుల ఆరోపణ**

**మంచిర్యాల**

పెళ్లయిన అమ్మాయిని ప్రేమిస్తున్నానని వేధిస్తున్న యువకుడిని ఓ కుటుంబం నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసింది. బైక్‌పై వెళ్తున్న అతన్ని అడ్డగించిన వివాహిత కుటుంబీకులు కత్తితో గొంతుకోశారు. తమ కోపం చల్లారేదాక పక్కనే ఉన్న పెద్ద బండరాయితో తలపై కొట్టి చంపారు. వివాహిత తల్లిదండ్రులు, సోదరి, సోదరుడు కలిసి ఈ దారుణానికి తెగబడ్డారు. ఈ భయానక ఘటన మంచిర్యాల జిల్లాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ఇందారం గ్రామానికి చెందిన పెద్దపల్లి కనకయ్య ? పద్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. వీళ్ల పెద్ద కుమార్తె శృతిని మహేశ్ (24) అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయం తెలిసి శృతికి నస్పూర్ గ్రామానికి చెందిన యువకుడితో గతేడాది వివాహం జరిపించారు. పెళ్లయినపన్పటికీ మహేశ్ వేధింపులు మానలేదు. వేధించడమే కాకుండా పెళ్లికి ముందు శృతితో సన్నిహితంగా ఉన్న వీడియోలను సోషల్‌మీడియాలో బహిర్గతం చేశాడు. ఆ వీడియోలు వైరల్ కావడంతో మనస్తాపం చెందిన శృతి భర్త.. ఆమెకు ఆరు నెలల క్రితం విడాకులు ఇచ్చారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్నుంచి మహేశ్‌తో శృతి కుటుంబానికి గొడవలు జరుగుతూనే ఉన్నాయి.మహేశ్ వేధిస్తున్నాడని జైపూర్ పోలీస్ స్టేషన్‌లో సైతం శృతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ మహేశ్ తన తీరు మార్చుకోలేదు. భర్త చనిపోయిన తర్వాత పుట్టింట్లోనే ఉంటున్న శృతికి తరచూ కాల్స్, మెసేజ్ చేస్తూ వేధించాడు. అతని టార్చర్ భరించలేని శృతి.. కుటుంబసభ్యుల ముందు బాధపడింది. తమ బిడ్డ జీవితంతో ఆడుకుంటున్నాడని మహేశ్‌పై కోపంతో రగిలిపోయారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బైక్‌లో పెట్రోల్ కొట్టించుకుని తమ ఇంటి ముందు నుంచి వెళు న్న సమయంలో మహేశ్‌ను అడ్డగించారు. శృతి తల్లిదండ్రులు, ఆమె సోదరుడు, సోదరి మహేశ్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. ముందుగా కత్తితో అతని గొంతు కోశారు. అనంతరం పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టి కొట్టి దారుణంగా చంపేశారు. నడిరోడ్డుపై ఇంత జరుగుతున్నా చుట్టుపక్కల వాళ్లు వీడియోలు తీసుకుంటూ ఉండిపోయారే తప్ప.. ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. పైగా ఈ తతంగం మొత్తాన్ని వీడియోలు తీశారు. ఈ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హత్య అనంతరం నిందితులు వెళ్లి పోలీసుల ముందు లొంగిపోయారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఏసీపీ నరేందర్, సీఐ రాజు ఘటనాస్థలిని సందర్శించారు.

# కొత్తవారిని పనిలో పెట్టుకుంటున్నారా

**ముందుగా పోలీసులను సంప్రదించాల్సిందే**

**హైదరాబాద్**

కొత్త వారిని పనిలో పెట్టుకోవాలని అనుకుంటున్నారా.. అయితే మీలాంటి వారి కోసమే హైదరాబాద్ పోలీసులు సూచనలు చేస్తున్నారు. కొత్త వారిని పనిలో పెట్టుకోవాలనుకుంటే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలని, వారి గురించి పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే పనిలో నియమించుకోవాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. పోలీసులు ఎంత పని ఒత్తిడితో ఉన్నా తప్పకుండా సహాయం చేస్తారని అన్నారు. ఈ నెల 3వ తేదీన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యాపారి ఇంట్లో ఇద్దరు మహిళలు పని చేరారు. రెండ్రోజుల తర్వాత ఇంట్లో ఉన్న వృద్ధుల కంట్లో కారం చల్లి 150 తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. కేసు నమోదు చేసుకుని వెంటనే గాలింపు చేపట్టిన హైదరాబాద్ పోలీసులు 200 సీసీటీవీ కెమెరాలను విశ్లేషించి, దొంగలు పాత నేరస్తులుగా గుర్తించారు. సాంకేతికత ఆధారంగా వారిని ముంబయిలో అరెస్టు చేశారు. ఇద్దరి నుండి 120 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ముంబయి, మహారాష్ట్ర నగర్ హాట్స్ కు చెందిన మహాదేవి రాజేశ్ కలాల్ అలియాస్ సునీత, పూజ సురేశ్ సాగత్ ఇళ్లల్లో పని చేస్తుంటారు. వీరికి నేర చరిత్ర ఉంది. అయితే ఈ నెల 2న ఎస్ఆర్ నగర్ శాంతి బాగ్ లేన్ లో నివాసం ఉంటున్న బి. రామ్ నారాయణ ఇంటికి వెళ్లిన సునీత.. ఇంట్లో పని చేస్తానని చెప్పగా వారు ఆమె గురించి ఎలాంటి వాకాబు చేయకుండా, వివరాలేవీ సేకరించకుండా ఇంట్లో పనిలో చేర్చుకున్నారు. అలాగే పూజ సురేశ్ కూడా మరొకరి ఇంటికి వెళ్లి పని చేస్తానని అడగ్గా వారు అన్ని వివరాలు అడిగారు. ఆధార్ కార్డు, గతంలో పని చేసిన వారి వివరాలు, సొంత ఊరు సహా ఇతర వివరాలు అడిగారు. ఆమె చెప్పిన సమాధానాలతో వారికి ఆమెపై నమ్మకం రాకపోవడంతో పూజ సురేశ్ ను పనిలో చేర్చుకోలేదు. ఈ క్రమంలో పూజ సురేశ్ కూడా తిరిగి సునీత పని చేస్తున్న చోటకే వచ్చేసి పనిలో కుదిరింది. పూజ సురేశ్ పనిలో చేరిన మరుసటి రోజే అంటే 3వ తేదీన ఇంట్లో వృద్ధులు మాత్రమే ఉన్నారు. ఇంట్లో ఉన్న ఆభరణాలు కూడా బయయకు కనిపిస్తుండటంతో అదే అదనుగా భావించి వారిద్దరూ ఆ వృద్ధుల కంట్లో కారం చల్లి బంగారు ఆభరణాలతో పరారయ్యారు.ఈ దొంగతనంపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఆర్ నగర్ పోలీసులు విచారణ ప్రారంభించారు. వారిద్దరి గురించి యజమాని వద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో సాంకేతికతపై దృష్టి పెట్టారు. ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. ఘటనా స్థలికి 25 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 200 సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బస్టాప్ లు, రైల్వేస్టేషన్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పలు సీసీ కెమెరాల్లో నిందితుల ఆనవాళ్లు కనిపించాయి. వారి గురించి డేటాబేస్ లో తనిఖీ చేయగా వాళ్లిద్దరి గురించి తెలిసింది. దీంతో నిందితులు ఇద్దరిని మహారాష్ట్రలో అరెస్టు చేసి వారి వద్ద నుండి 120 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

# జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

**పెద్దపల్లి**



జూనియర్ పంచాయితీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరిం చాలని పెద్దపల్లి జిల్లా పంచాయతి కార్యదర్శులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పంచాయతి కార్యదర్శుల సమావే శంలో జిల్లా అధ్యక్షుడు ఎడివల్లిసంతోష్, ప్రదాన కార్యదర్శి ముడిగాల పర్శరాం మాట్లాడు తూ పంచాయితీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం పూర్తిఅయ్యి నాలుగేళ్లు అవుతున్నా తమ ఉద్యో గాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో జారీచే యకుండా కాలయాపన చేస్తోందన్నారు. జీవో 26 ప్రకారమే తమను రెగ్యూలరైజ్ చేయకుండా తాత్సారం చేయడం తగదన్నారు. జూనియర్ పంచాయితీ కార్యదర్శులను సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెగ్యులర్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసి సర్వీస్ కాలాన్ని కలిపి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమకు ఉద్యోగ భద్రత లేక టీఏ, డీఏ, హెచ్ఆర్ఏ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కోల్పోతున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఏలాంటి స్పందన లేకపోవడంతో టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం ఈ నెల 13 నుండి వివిధ రకాల నిరసన కార్యక్రమాలను చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే విధుల సమయంలో శాంతియుత నిరసన తోపాటు సీఎంకు పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నేటి నుండి డెలీ సానిటేషన్ రిపోర్ట్ యాప్ ను అనిస్టాల్ చేస్తూ విధులను బహిష్కరిస్తా మని హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందిం చి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేస్తూ జీవోను విడుదల చేయాలని వారు కోరారు. ఈనెల 28 వరకు ప్రభుత్వం తరఫున ఎలాంటి స్పందన లేకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు కూడా సమాయత్త మవుతామన్నారు. ఈ సమావేశంలో పంచాయతి కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్య క్షుడు జక్కం భానుప్రసాద్, జిల్లా కోశాధికారి అమ్జద్ పాషా, సహచర అద్యక్షుడు ఎం.వేణు, ఎన్.సాగర్ రావు, ఎం.హరీష్, యండీ.జుహిబ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ సునీత రాజకీయ రంగ ప్రవేశం అంటూ పోస్టర్లు

**ప్రొద్దుటూరు**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులకు శిక్ష పడాలని పోరాడుతున్న వైఎస్ సునీత తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నారని రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నారని ప్రొద్దుటూరులో పోస్టర్లు వెలిశాయి. తెలుగుదేశం పార్టీలోకి రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నారని స్వాగతం పలుకుతూ చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, అచ్చెన్నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, బీటెక్ రవిల ఫోటోలతో కూడిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకెళితే?. ప్రొద్దుటూరు పట్టణంలో వైఎస్ వివేకా కుమార్తె వైఎస్ సునీత పోస్టర్లు కలకలం సృష్టించాయి. వైఎస్ సునీత రాజకీయ రంగప్రవేశం చేస్తుందంటూ రాత్రికి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రొద్దుటూరు పట్టణమంతా పోస్టర్లు అతికించారు.
వైఎస్ సునీత తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు వాల్ పోస్టర్లలో వైఎస్ వివేకానంద రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, టీడీపీ పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు మరికొంత మంది టీడీపీ ముఖ్య నేతల ఫోటోలు కూడా ఉన్నాయి. తెల్లవారే సరికి పట్టణమంతా వాల్ పోస్టర్లు చూసిన ప్రజలు దీనిపై పెద్ద ఎత్తున చర్చ పెట్టారు. ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన ఎర్ర మునిరెడ్డి కాలనీ, హోమస్ పేట, మున్సిపల్ పార్కు, వివేకానంద క్లాత్ మార్కెట్ కూడళ్లలో ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. అయితే సంప్రదాయంగా టీడీపీ నేతలు వేసే పోస్టర్ల తరహాలో ఇవి లేవు. పైగా తెలుగుదేశం పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఇలాంటివి వైసీపీ నేతలే చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైఎస్ సునీత రాజకీయంగా పోటీలోకి వస్తారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికే ఆమె టీడీపీలో చేరుతారని..టీడీపీ అధ్యక్షుడ్ని కలిశారని ఆరోపించారు. అయితే రాజకీయంగా ఇంత వరకూ సునీత ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ఆమె రాజకీయాలపై ఆసక్తి ఉన్నట్లుగా ప్రకటించలేదు. ప్రముఖ వైద్యురాలు అయిన ఆమె.. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఓ వైపు వివేకా హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతూనే మరో వైపు .. విధులకూ హాజరవుతున్నారు. రాజకీయంగా ఎవరు వచ్చినా ఆమె కలిసేందుకు ఆసక్తి చూపరని అంటున్నారు. మరి ఎవరు సునీత తెలుగుదేశం పార్టీలో చేరుతారని పోస్టర్లు వేశారన్నది మాత్రం సస్పెన్స్ గా మారింది. టీడీపీ నేతలు పోస్టర్లు వేస్తే.. వారు ఆ విషయాన్ని చెప్పుకుంటారు.. కానీ ఎవరుపోస్టర్లు వేశారో ఎవరికీ తెలియదు. అదీ కాకుండా అసలు ఒక్క ప్రొద్దుటూరులోనే ఎందుకు పోస్టర్లు వేశారనేది కీలకంగా మారింది. ఇది వైసీపీ నేతల పనేనని.. టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు చేస్తున్న ప్రయత్నంగా అనుమానిస్తున్నారు. ఆమెపై టీడీపీ ముద్ర వేస్తే.. విషయం రాజకీయం అవుతుందని అందుకే ఇలా చేస్తున్నారని అంటున్నారు.




# ప్రభుత్వ అవార్డును తిరస్కరించిన గ్రామ సర్పంచ్

**అమలాపురం**

అంబెడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచులకు సన్మానాలు జరిగాయి. అయితే అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామ సర్పంచ్ శ్యామ్ కుమార్ తన సన్మానాన్ని తిరస్కరిం చారు. రాష్ట్ర ప్రభుత్వం పంచా యతీ లను అస్తవ్యస్తం చేసిందంటూ సర్పంచ్ శ్యామ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పంచా యతీలకు రావలసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించు కుని సర్పంచులను ఉత్సవ విగ్రహా లుగా మార్చింది అంటూ అధికారుల ముందు అసహనం వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో జడ్పిటిసి పందిరి శ్రీహరి, సర్పంచ్ శ్యామ్ కుమార్ మధ్య మాటల యుద్ధం నడిచింది. గ్రామంలో ఏ యొక్క అభివృద్ధి చెయ్యలేనం దుకు నిరసనగా సన్మానాన్ని, అవార్డును సర్పంచ్ శ్యామ్ కుమార్ తిరస్కరిం చారు.

# జూబ్లీహిల్స్ గ్యాంగ్ రేప్ కేసులో కీలక మలుపు

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్‌లో గత ఏడాది ఆరుగురు బాలురు కలిసి ఓ మైనర్ బాలికను అత్యాచారం చేసిన సంగతి తెలిసిందే. కారులోనే వారు ఆ అఘాయిత్యానికి పాల్పడ్డారు. నిందితులైన ఆరుగురిలో ఐదుగురు మైనర్లు కాగా, ఒకరు మేజర్ అని అప్పుడు పరిగణించారు. అయితే, ఈ గ్యాంగ్ రేప్ కేసులో అత్యాచారం కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆరో నిందితుడిగా ఉన్న బాలుడిని మేజర్‌గా పరిగణించాలని గతంలో పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టేసింది. మైనర్‌గానే పరిగణించి దర్యాప్తు చేయాలని పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.సుమారు 10 నెలల క్రితం 2022 మే 28న సామూహిక అత్యాచారం ఘటన జరిగిన సంగతి తెలిసిందే. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలోని ఆమ్నేషియా పబ్‌లో పార్టీ చేసుకున్న కాలేజీ విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయే క్రమంలో ఓ బాలికను కొందరు బాలురు కారులో ఎక్కించుకొని వెళ్లారు. నగరంలో కారులో తిరుగుతూనే వారు అఘాయిత్యానికి పాల్పడ్డారు. వెంటనే ఈ కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు సాదుద్దీన్‌తో పాటు ఐదుగురు మైనర్లు నిందితులుగా ఉన్నారు. ఐదుగురు మైనర్లలో నలుగురిని మేజర్లుగానే పరిగణించాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. ఇది కాస్త తీవ్రమైన కేసు కాబట్టి, మైనర్లను మేజర్లుగా పరిగణించాలని కోరారు. 2022 సెప్టెంబర్ 30న నిందితులను మేజర్లుగా పరిగణిస్తూ జువెనైల్ జస్టిస్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జువెనైల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ హైకోర్టుకు ఆశ్రయించారు.

ప్రజా తపన
prajathapana.com

# అజయ్ భూపతి 'మంగళవారం' సినిమాలో శైలజగా పాయల్ రాజ్‌పుత్

అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'మంగళవారం'. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతున్న చిత్రమిది. ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం, 'ఎ' క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అజయ్ భూపతి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్టు ఈ రోజు తెలిపారు. సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు.

'ఆర్ఎక్స్ 100'తో అజయ్ భూపతి దర్శకుడిగా పరిచయం అయ్యారు. నాయికగా తెలుగులో పాయల్ రాజ్‌పుత్ తొలి చిత్రమది. తెలుగు తెరకు ఆమెను కథానాయికగా పరిచయం చేశారు. ఆ సినిమా తర్వాత అజయ్ భూపతి, పాయల్ రాజ్‌పుత్ కలయికలో వస్తున్న చిత్రమిది.
'మంగళవారం' సినిమాలో శైలజ పాత్రలో పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్నట్లు ఫస్ట్ లుక్ విడుదల సందర్భంగా తెలిపారు. ఆ లుక్ చూస్తే... పాయల్ కళ్ళల్లో కన్నీటి పొర కనబడుతోంది. ఆమె వేలిపై సీతాకోక చిలుక ఉంది. జడలో మల్లెపూలు ఉన్నాయి. అయితే, ఒంటి మీద ఒక్క నూలుపోగు కూడా లేదు. వెనుక నుంచి ఫోటో తీశారు. ఇదొక ఎమోషనల్ అండ్ బోల్డ్ లుక్ అని చెప్పవచ్చు.
పాయల్ రాజ్‌పుత్ ఫస్ట్ లుక్ విడుదల చేసిన సందర్భంగా దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో 1990వ దశకంలో సాగే కథతో తీస్తున్న చిత్రమిది. మన నేటివిటీతో కూడిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. రా అండ్ రస్టిక్ గా ఉంటుంది. థియేటర్ల నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ప్రేక్షకులకు గుర్తు ఉండేలా పాయల్ క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఇప్పటి వరకు ఇండియాలో ఎవరూ ప్రయత్నించనటువంటి కొత్త జానర్ సినిమా. సినిమాలో 30 పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్రకూ కథలో ప్రాముఖ్యం ఉంటుంది" అని అన్నారు.
నిర్మాతలు స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం మాట్లాడుతూ "అజయ్ భూపతి గారు దర్శకత్వం వహించిన 'ఆర్ఎక్స్ 100'లో ఇందు పాత్ర ప్రేక్షకులకు ఎలా గుర్తు ఉండిపోతుందో, ఇప్పుడీ 'మంగళవారం'లో శైలజ పాత్ర కూడా అలాగే గుర్తు ఉంటుంది. ఇప్పటికి 75 రోజులు షూటింగ్ చేశాం. ఎక్కువ శాతం నైట్ షూట్స్ ఉన్నాయి. వచ్చే నెలలో ఆఖరి షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. టెక్నికల్ పరంగా సినిమా హై స్టాండర్డ్స్ లో ఉంటుంది. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు" అని చెప్పారు.
ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి, ఆర్ట్ : రఘు కులకర్ణి, సౌండ్ డిజైనర్ & ఆడియోగ్రఫీ : 'నేషనల్ అవార్డ్ విన్నర్' రాజా కృష్ణన్, సినిమాటోగ్రఫీ : దాశరథి శివేంద్ర, మ్యూజిక్ : 'కాంతార' ఫేమ్ బి. అజనీష్ లోక్‌నాథ్, కథ - స్క్రీన్ ప్లే - దర్శకత్వం : అజయ్ భూపతి.



# సీక్వెల్ 'యాత్ర 2'

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జీవితం ఆధారంగా దర్శకుడు మహి వి. రాఘవ్ తీసిన సినిమా 'యాత్ర'. అందులో పాదయాత్ర మీద ఎక్కువ ఫోకస్ చేశారు. మిగతా అంశాలను ప్రస్తావించారు. వైఎస్సార్ పాత్రలో మలయాళ స్టార్ మమ్ముట్టి నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ బరిలో మంచి విజయం సాధించింది. 'యాత్ర' విడుదలైన కొన్నాళ్లకు దానికి సీక్వెల్ 'యాత్ర 2' తీస్తారని వినిపించింది. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితం ఆధారంగా సీక్వెల్ ఉంటుందని తెలిపారు. అయితే, ఇప్పటి వరకు అది సెట్స్ మీదకు వెళ్ళలేదు. అందువల్ల, ఆ సినిమా ఉంటుందా? లేదా? అని సందేహాలు నెలకొన్నాయి. అటువంటి వాటికి మహి వి. రాఘవ్ చెక్ పెట్టారు.'యాత్ర 2' తప్పకుండా ఉంటుందని మహి వి. రాఘవ్ తెలిపారు. అయితే, సినిమా గురించి ఎక్కువ వివరాలు చెప్పలేదు. "ప్రస్తుతానికి 'యాత్ర 2' గురించి ఎక్కువగా నేను మాట్లాడలేను. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు జరిగిన వాస్తవ సంఘటలను తీసుకుని సినిమా చేయాలి? నటీనటులుగా ఎవరిని తీసుకోవాలి? కంటెంట్ ఏం ఉండాలి? వంటి అంశాల గురించి నాకు క్లారిటీ వచ్చిన తర్వాత మరింత మాట్లాడతాను. అయితే, ఒక్కటి మాత్రం చెప్పగలను... 'యాత్ర 2', నేను చెప్పాలి అనుకున్న కథ! తప్పకుండా చెప్పి తీరుతా" అని లేటెస్ట్ ఇంటర్వ్యూలో మహి వి. రాఘవ్ పేర్కొన్నారు. ఆనందో బ్రహ్మ', 'యాత్ర' సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో మహి వి. రాఘవ్ చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన నిర్మాతగా మారారు. అభినవ్ గోమటం, పావని గంగిరెడ్డి ఓ జంటగా... ప్రియదర్శి, 'జోర్దార్' సుజాత మరో జంటగా... చైతన్య కృష్ణ, దేవయాని ఇంకో జంటగా నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. అంతరించిపోతున్న పులులను, మొగుళ్లను కాపాడుకుందాం... అనేది ఉప శీర్షిక. దీనిని చిన్నా వాసుదేవ రెడ్డితో కలిసి మహి వి. రాఘవ్ నిర్మించారు. ప్రదీప్ అద్వైతంతో కలిసి షో రన్నర్ (క్రియేటర్)గా వ్యవహరించారు.'సేవ్ ద టైగర్స్'లో శ్రీకాంత్ అయ్యంగార్, హర్షవర్ధన్, గంగవ్వ, వేణు టిల్లు, హర్షవర్ధన్, రోహిణి, సద్దాం తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్, ప్రోమోలు మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. 'సేవ్ ద టైగర్స్'తో తేజా కాకుమాను దర్శకుడిగా మారారు. దీని కంటే ముందు 'బాహుబలి', 'ఆకాశవాణి' సహా పలు సినిమాల్లో నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఇంకా ఈ సిరీస్ కు రచన : ప్రదీప్ అద్వైతం, ఛాయాగ్రహణం : ఎస్.వి. విశ్వేశ్వర్, కూర్పు : శ్రవణ్ కటికనేని, సంగీతం : శ్రీరామ్ మద్దూరి.




# రాణిగారి గదిలో దెయ్యం ట్రైలర్ ఆవిష్కరణ



రోషన్, సాక్షి, స్రవంతి, పూజా దే కీలక పాత్రధారులుగా రూపొందుతున్న 'రాణిగారి గదిలో దెయ్యం'. అబిద్ దర్శకత్వంలో మౌంట్ ఎవరెస్ట్ పిక్చర్స్ పతాకంపై పి.వి.సత్యనారాయణ నిర్మించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, ఆర్.కె.గౌడ్ ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు. సినిమా విజయవంతం కావాలని అభిలషించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "హారర్ కంటెంట్ చిత్రాలకి ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. ఈ చిత్రం సక్సెస్ కావాలి" అని అన్నారు.
నిర్మాత పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ "మా బ్యానర్‌లో వస్తున్న ఐదో సినిమా ఇది. హారర్ కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా సాగే చిత్రమిది. త్వరలో విడుదల చేస్తాం" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నన్ను నమ్మి నిర్మాత అవకాశం ఇచ్చారు. హారర్ కథతో చక్కని సినిమా తీశాం. షేర్ చక్కని సంగీతం అందించారు. ఈ జర్నీలో చాలామంది నాకు సహకరించారు.
సిరాజ్ మాట్లాడుతూ "తెలుగు ఇండస్ట్రీలో దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నా. నా మొదటి సినిమా నుంచి ప్రసన్నకుమార్ సపోర్ట్ చేస్తున్నారు. మంచి కథతో ఈ సినిమా చేశాం. చక్కని పాటలు కుదిరాయి. ఈ సినిమాలో అవకాశం పట్ల నటీనటులు ఆనందం వ్యక్తం చేసి, సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు.
నటీనటులు: రోషన్, సాక్షి, స్రవంతి, పూజా దే ఖలీల్ జాంబియా తదితరులు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950